PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 282 | విజయవాడ, సోమవారం 15 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Monday 15 May 2023 | Rs


కొనసాగిన రెజ్లర్ల ఆందోళన

- వ్యవసాయ కార్మిక సంఘాల నేతల సంఘీభావం

5

రాష్ట్రంలో 47 డిగ్రీలు

- ప్రజలు అప్రమత్తంగా వుండాలి
- తీవ్ర వడగాల్పుల ముప్పు
- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు



లోపలి పేజీలో..

సిబిఐ చీఫ్‌గా కర్ణాటక డిజిపి ప్రవీణ్ సూద్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) తదుపరి డైరెక్టర్‌గా కర్ణాటక డిజిపి ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత సిబిఐ డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైశ్వాల్ పదవీ విరమణ అనంతరం ప్రవీణ్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరితో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ శనివారం సాయంత్రం సమావేశమైంది. కర్ణాటక డిజిపి ప్రవీణ్ సూద్, మధ్యప్రదేశ్ డిజిపి సుధీర్ సక్సేనా, తాజ్ హాసన్‌లను ఈ పదవి కోసం ఎంపిక చేసింది. చివరికి ప్రవీణ్ సూద్‌ను సిబిఐ డైరెక్టర్‌గా నియమించింది. ప్రస్తుత సిబిఐ డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైశ్వాల్ రెండేళ్ల పదవీ కాలం మే 25తో ముగుస్తుంది. అనంతరం ప్రవీణ్ సూద్ సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. సిబిఐ డైరెక్టర్ పదవిలో నియమితులైనవారి పదవీ కాలం రెండేళ్లు. ఆ తరువాత ఐదేళ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. ప్రవీణ్ కర్ణాటక కేడర్ 1986 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ప్రస్తుతం కర్ణాటక డిజిపిగా పని చేస్తున్నారు. ఆయనపై ఇటీవల కర్ణాటక పిసిసి అధ్యక్షుడు డికె శివకుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని, బిజెపిని కాపాడుతున్నారని, ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే ఆ రాష్ట్ర డిజిపిని సిబిఐ డైరెక్టర్‌గా నియమించడం విశేషం.

చంద్రబాబు నివాసం జప్తు

రాజధాని భూముల కుంభకోణం కేసులో దర్యాప్తు వేగవంతం

- సుప్రీంకోర్టు స్టే తొలగింపుతో మళ్లీ రంగంలోకి సిఐడి
- మాజీ మంత్రి నారాయణ, పలువురు టిడిపి నేతల ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు అటాచ్



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని భూముల కుంభకోణం కేసులో ఉండవల్లి కరకట్టపైనున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని సిఐడి జప్తు చేసింది. మాజీ మంత్రి నారాయణ సహా పలువురు టిడిపి నేతల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు అటాచ్ చేసింది. రాజధాని రాక ముందు అమరావతిలో భూముల కొనుగోలుకు సంబంధించి వైసిపి ప్రభుత్వం నియమించిన సిట్ (సిఐడి) దర్యాప్తు వేగం పుంజుకుంది. చంద్రబాబుపై దాఖలైన కేసుల దర్యాప్తుపై హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను సుప్రీం కోర్టు ఇటీవల తొలగించడంతో సిఐడి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. రాజధాని ప్రాంతంలో అక్రమంగా భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలపై పలువురి ఆస్తుల జప్తు ప్రక్రియను ఆదివారం ప్రారంభించారు. క్రిమినల్ లా అమెండ్‌మెంట్ 1944 చట్టం ప్రకారం ఆస్తులు, బ్యాంకుల్లోని నగదు జప్తు చేసినట్టు ప్రకటించారు. క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారన్న అభియోగాలపై చంద్రబాబు, మాజీ మంత్రి పి.నారాయణలతోపాటు పలువురిపై సిఐడి దర్యాప్తు జరుగుతోంది. సిఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్లలో అవకతవకలు జరిగాయని, అధికార పదవులను ఉపయోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు, టిడిపి వారికి మేలు చేశారని సిఐడి అభియోగాలు మోపింది. తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని కరకట్ట వద్ద ఉన్న లింగమనేని ఎస్టేట్ అతిథి గృహం (చంద్రబాబు ప్రస్తుతం ఉంటున్న నివాసం)తో పాటు పలువురి ఆస్తులను జప్తు చేసింది. రాజధాని ప్రాంతంలో తనకు అనుకూలంగా అలైన్‌మెంట్ మార్చినందుకు క్విడ్ ప్రోకో కింద చంద్రబాబుకు ఈ అతిథి గృహాన్ని లింగమనేని సంస్థ అధినేత రమేష్ బహుమతిగా ఇచ్చారనేది సిఐడి ఆరోపణ. దానిని జప్తు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చంద్రబాబు రాజధాని ప్రాంతంలో లింగమనేని రమేష్‌కి లబ్ధి చేకూరే విధంగా రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చారని, చిన్న రైతులకు నష్టం చేస్తూ లింగమనేనితోపాటు చంద్రబాబు సొంతమనుషుల ఆస్తుల విలువ పెంచే విధంగా రాజధాని మాస్టర్ ప్లాన్ మార్చారనేది సిఐడి అభియోగం. హెరిటేజ్ డైరెక్టరుగా ఉన్న అప్పటి మంత్రి నారా లోకేష్... లింగమనేని రమేష్ నుంచి రాజధాని ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారని అభియోగం మోపింది. నారా లోకేష్‌తోపాటు పలువురు టిడిపి నాయకులు రాజధాని ప్రాంతంలో బినామీల పేరుతో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్టు వైసిపి నాయకులు సిఐడికి గతంలో ఫిర్యాదు చేశారు. రాజధాని ప్రాంతంలోని స్టార్ట్ అప్ ప్రాంతంలో రూ.3.66 కోట్లతో 2015 జూన్, జులై, ఆగస్టు నెలల్లో బినామీ పేర్లతో భూమి కొనుగోలు చేశారని అప్పటి మంత్రి నారాయణపై అభియోగం ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు చెందిన నారాయణ విద్యా సంస్థల ఉద్యోగి పొత్తూరి ప్రమీల, ట్రెజరర్ రాపూరు సాంబశివరావు పేరుతో ఉన్న ఆస్తులను సిబిఐ జప్తు చేసింది. రాజధాని గ్రామాల్లో నారాయణతోపాటు ఇతరులకు చెందిన మొత్తం 75,880 గజాల విస్తీర్ణంలోని ప్లాట్లు జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వీటిలో ఉద్దండరాయునిపాలెంలోని 2,040 గజాల రెండు ప్లాట్లు, రాయపూడిలోని 18,140 గజాల విస్తీర్ణంలోని ప్లాట్లు ఉన్నాయి. లింగాయపాలెంలో 12,440 గజాల ప్లాట్లు, మందడంలో 39640 గజాల ప్లాట్లు జప్తు చేశారు. కొండమరాజుపాలెంలో 3,180 గజాల ప్లాట్లు జప్తు చేసిన వాటిలో ఉన్నాయి. రామకృష్ణ హౌసింగ్ ఎండి కెపివి అంజనీకుమార్‌కు చెందిన రాయపూడిలోని రెండు ఎకరాల భూమిని, పలువురి బ్యాంకు ఖాతాల్లోని రూ.1,92,11,482 నగదును సిఐడి జప్తు చేసింది. హైదరాబాద్ చందానగర్ బ్రాంచిలో పొట్లూరి ప్రమీలకు చెందిన రూ.40.88 లక్షలు, రాపూరి సాంబశివరావుకు చెందిన రూ.60.94 లక్షలు, వివిధ బ్యాంకుల్లో ఆవుల శంకర్‌కు చెందిన రూ.69,16502, కె.వరుణ్‌కుమార్ పేరిట ఉన్న రూ.21,11,660 జప్తు చేసిన వాటిలో ఉన్నాయి.



దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్న జగన్

- టిడిపి నేతల ఆగ్రహం

లోపలి పేజీలో...



నుజ్జునుజ్జయిన ఆటో



ప్రమాదానికి కారణమైన బస్సు

దూసుకొచ్చిన మృత్యువు

- ఆటోను ఢీకొన్న బస్సు
- ఏడుగురు మహిళా కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి- తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని మహిళా కార్మికులు. రొయ్యల ఫ్యాక్టరీలో రోజు కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఎప్పటిలానే ఆదివారమూ పనికి వెళ్లి ఆటోలో తిరుగు పయనమయ్యారు. ప్రయివేటు బస్సు రూపంలో మృత్యువు వారిని వెంటాడింది. కోరంగి సమీపంలో వారి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలోని అపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో యానాం, తాళ్లరేవు మండలాలకు చెందిన పలువురు మహిళలు పనిచేస్తున్నారు. ఆదివారం పని పూర్తయిన తర్వాత యానాంకు చెందిన 14 మంది మహిళలు ఆటోలో ఇంటికి పయనమయ్యారు. కోరంగి గ్రామంలోని ఎపి.సుబ్బారాయుడు దిమ్మ సెంటర్ వద్ద ఓ ప్రయివేటు బస్సు అదుపు తప్పి వారి ఆటోపైకి దూసుకొచ్చింది. వంద అడుగుల దూరం వరకూ ఆటోను ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యానాంకు చెందిన బి.అనంతలక్ష్మి (47), చింతపల్లి జ్యోతి (39), కల్లి పద్మ (38), నిమ్మకాయల లక్ష్మి (54), కర్రి పార్వతి (42), చేశెట్టి వెంకటలక్ష్మి (41) అక్కడికక్కడే మృతి చెందారు. బుడపనేటి సత్యవతి (35) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించారు. నోట్ల సత్యవేణి, ఓలేటి లక్ష్మి, మల్లాడి గంగాభవాని, రచ్చ వెంకటేశ్వరమ్మ, బుడపనేటి ప్రభావతి, కోటి నీలిమ, చింతపల్లి మంగాయమ్మ తీవ్రగాయాలతో కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి మురళీకృష్ణ, కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాస్, కోరంగి ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు.

బాధితులకు ఎమ్మెల్యేల పరామర్శ

ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాధితులను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రూ.25 లక్షల చొప్పున పరిహారమివ్వాలి : సిపిఎం

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం తాళ్లరేవు మండల కార్యదర్శి టేకుమూడి

మిగతా 2లో

విహార యాత్రలో విషాదం

- అవుకు రిజర్వాయర్‌లో పర్యాటక బోటు బోల్తా
- ఇద్దరు మృతి
- ఒకరు గల్లంతు

లోపలి పేజీలో..

చుక్కల భూముల రీ- వెరిఫికేషన్

- 1బిలో పేరు ఉంటే క్రమబద్ధీకరణ
- సాదా బైనామా మ్యుటేషన్ అధికారం తహసీల్దార్‌కే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దశాబ్దాలుగా అపరిష్కృత సమస్యగా మిగిలిపోయిన డాటెడ్ ల్యాండ్స్ (చుక్కల భూములు) చిక్కులకు ప్రభుత్వం ఇటీవల శాశ్వత పరిష్కారం చూపింది. ఇందుకు సంబంధించి 97,471మంది రైతులకు మేలు చేస్తూ 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కులను కల్పించినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన బహిరంగసభలో ప్రకటించిన సంగతి పాఠకులకు విదితమే. దాని అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 22(ఎ)(1)కు సంబంధించిన చుక్కల భూములు, వాటి స్వరూపాలను గతంలో కలెక్టర్లు ఇచ్చిన నివేదికలను మరొక్కసారి క్షేత్రస్థాయిలో రీ-వెరిఫికేషన్ చేయాలంటూ సిసిఎల్ఎ సాయి ప్రసాద్ 26 జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం తహశీల్దార్లకు చుక్కల భూముల్లో చుక్కలను తొలగించే అధికారం ప్రభుత్వం కట్టబెట్టింది. ఆర్ఎస్ఆర్‌తో సంబంధం లేకుండా 1బి లేక అడంగల్‌లో భూ యజమాని పేరు ఎటువంటి మార్పులు లేకుండా ఒకే పేరు నమోదు చేసి ఉంటే ఆయా భూ యజమానులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఒక వేళ 1బిలో భూ యజమాని పేరు గతంలో ఒకరి పేరు ఉండి,ప్రస్తుతం మరొకరి పేరు నమోదు కావడం, లేక భూమిపై మరొకరు ఉండటం జరిగితే ఆయా భూములకు సంబంధించి తహశీల్దార్ స్థాయిలో మ్యుటేషన్ ప్రక్రియ ద్వారా మార్పులు చేసే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు అనుగుణంగా రెవెన్యూ రికార్డులను ఆధునీకరించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం సూచనలను పరిగణలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీ నోటిఫికేషన్ ప్రభావంతో ఎపి డాటెడ్ ల్యాండ్స్ (రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్‌లో నవీకరణ) చట్టంలోని సెక్షన్ (4) సబ్ సెక్షన్ (3) కిందకు వచ్చే చుక్కల భూములకు సంబందించిన రికార్డులు ఆక్రమణలో ఉన్న సంబంధిత రైతుల పేర్లతో ఆధునీకరించవచ్చుని ఆయా భూములన్నీ చట్టానికి లోబడి, అందులో పేర్కొన్న షరతులకు లోబడి ఉన్నప్పుడు మాత్రమే మ్యుటేషన్ చేసుకునే అవకాశం కలుగుతుంది. పట్టాదారు పేరు ఇప్పటికే ఇప్పటికే రెవెన్యూ రికార్డుల్లో భాగమైతే పట్టాదారు కాలమ్‌లోనినమోదులు చెల్లుబాటు అయ్యే విధంగా పరిగణించబడనున్నాయి. డిఎల్ఎసికి తదుపరి సూచన లేకుండా మ్యుటేషన్ ప్రక్రియ వీటిలో అన్ని చర్యలు తహశీల్దార్ స్థాయిలోనే కేసులు ముగుస్తాయి. పట్టాదారు పేర్లు భాగం కాని సందర్భాల్లో రెవెన్యూ రికార్డుల్లో నవీకరించరెవెన్యూ రికార్డులు (1-బిమరియు అడంగల్) ప్రభుత్వం ఇప్పటికే ఈ కేసుల్లో లావాదేవీలను అనుమతించినందునేదైనా మార్పులు చేయవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అధిష్టానానికే అప్పగింత

- సిఎం ఎంపికపై కర్ణాటక సిఎల్‌పి ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు : కొత్త ముఖ్యమంత్రి ఎంపిక నిర్ణయాన్ని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు అప్పగిస్తూ కర్ణాటక సిఎల్‌పి ఆదివారం ఏకగ్రీవంగా తీర్మానించింది. బెంగళూరులోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో సమావేశమైన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఆనవాయితీ ప్రకారం కొత్త సిఎల్‌పి నేతను నిర్ణయించే అధికారాన్ని అధిష్టానానికే వదిలేసింది. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీనేతను ఎన్నుకునేందుకు ఏర్పాటైన ఈ సమావేశానికి ఎఐసిసి పరిశీలకులు సుశీల్ కుమార్ షిండే, జితేంద్ర సింగ్, దీపక్ బబారియా, ఎఐసిసి కర్ణాటక ఇన్‌ఛార్జి రణదీప్ సూర్జేవాలా హాజరయ్యారు. సమావేశానికి ముందు మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కెపిసిసి అధ్యక్షుడు డి.కె. శివకుమార్ లతో ఎఐసిసి పరిశీలకులు సమావేశమయ్యారు. కర్ణాటకలో కొత్త ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఈ నెల 18 (గురువారం) ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కార్యక్రమానికి సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే హాజరవుతారని, ప్రతిపక్ష పార్టీలకు కూడా ఆహ్వానం పంపుతారని తెలిసింది. పాత అసెంబ్లీ గడువు

మిగతా 5లో



సిఎల్‌పి సమావేశంలో మాట్లాడుతున్న రణదీప్ సూర్జేవాలా

ప్రజాసేవకే కాంగ్రెస్ ప్రాధాన్యత : ఖర్గే

పార్టీకి ఎవరు ఓటు వేసినా, వేయకపోయినా రాష్ట్ర ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ ప్రాధాన్యత అని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఢిల్లీలోని10 రాజాజీ మార్గ్ నివాసంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎల్‌పి సమావేశ అభిప్రాయాలను పరిశీలకులు హైకమాండ్‌కు తెలియజేస్తారని, ఆ తరువాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ప్రజల విజయమని అన్నారు. ప్రజలు బిజెపిని తిరస్కరించారని, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతితో సతమతమవుతున్న ప్రజలు కాంగ్రెస్‌ను భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కోసం కాంగ్రెస్‌కు భారీ తీర్పు ఇచ్చారని చెప్పారు. ప్రజలు, ముఖ్యంగా పేదలు, మహిళలు, మైనార్టీలు, దళితులు కాంగ్రెస్ ఐదు హామీలను అంగీకరించారని, వారి అంచనాలకు అనుగుణంగా కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడిన తొలిరోజే వాటిని అమలు చేస్తామని ఖర్గే చెప్పారు. "ప్రభుత్వాన్ని సక్రమంగా నడపాలి, ఇది ఏకాభిప్రాయంతోనే సాధ్యం. మాది ప్రజాస్వామ్య పార్టీ.... ఎన్నికల్లో ఇప్పటి వరకు అంతా సజావుగా ఉంది, మాకు మెజారిటీ వచ్చింది, వీలైనంత త్వరగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు.



పదేళ్లుగా పెరగని పరిహారం

- పంట నష్టానికి అరకొరగా ఇన్‌పుట్ సబ్సిడీ
- పెట్టుబడి వ్యయం పెరిగినా కనికరించని ప్రభుత్వం

లోపలి పేజీలో..



ఏజెన్సీ కాఫీకి గిరాకీ

- అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్
- డౌనూరులో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రయత్నం

రవాణా రంగాన్ని కాపాడాలి

- కార్మికుల జీవనోపాధిని నిలబెట్టాలి
- సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించాలి
- రోడ్డు రవాణా కార్మిక సంఘాల జాతీయ సదస్సు పిలుపు



రోడ్డు రవాణా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఆర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రవాణా రంగాన్ని కాపాడాలని, కార్మికుల జీవనోపాధిని కాపాడాలని ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఆర్గనైజేషన్స్ నేషనల్ కన్వెన్షన్ పిలుపునిచ్చింది. ఆదివారం నాడిక్కడ సిఐటియు కేంద్ర కార్యాలయం (బిటిఆర్ భవన్)లో జరిగిన సదస్సుకు కె.కె.దివాకరన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్), ధర్మవీర్ చౌదరి (ఎన్ఎఫ్ఐఆర్‌టిడబ్ల్యు), జయరాజన్ (ఎఐసిసిటియు), నాగరాజన్ (టిటిఎస్ఎఫ్) అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఎన్ఎఫ్ఐఆర్‌టిడబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిర్మల్ సింగ్ ధాలివాల్, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, ఎఐసిసిటియు నేత ఎస్.కె.రాయ్, టిటిఎస్ఎఫ్ నేత సంపత్ మాట్లాడారు. ఆర్.లక్ష్మయ్య ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌ను కన్వెన్షన్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సదస్సుకు అతిథిగా హాజరైన సిఐటియు కార్యదర్శి ఆర్.కరుమ్‌లైయన్, ఎఐటియుసి ఉపాధ్యక్షుడు గిరి ప్రసంగించారు.

సదస్సు నిర్ణయాలు

జూన్, జులై నెలల్లో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించాలని కన్వెన్షన్ పిలుపునిచ్చింది. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రవాణా కార్మికులంతా ఆ కార్యక్రమంలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సదస్సు కోరింది.

సెప్టెంబర్ రెండో వారంలో అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ స్థాయిలో ప్రదర్శనలు జరపాలని, రాష్ట్రస్థాయిలో సమన్వయ కమిటీ నాయకత్వం సమావేశమై కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న రోడ్డు రవాణా కార్మికులందరూ పాల్గొని కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయాలని సదస్సు విజ్ఞప్తి చేసింది.

ఉన్నత విద్యలో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యాసంస్థల్లో వికలాంగ విద్యార్థులకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఆదివారం జివో 27ను విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఐదు శాతం కల్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రవేశాలకు గరిష్ట వయోపరిమితి ఐదేళ్లు సడలించింది. వికలాంగుల సంపూర్ణ సాధికారతకు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని స్త్రీ, శిశు, విభిన్నప్రతిభావంతుల శాఖ మంత్రి కెవి ఉషశ్రీచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాన అవకాశాలు కల్పించి ఆత్మగౌరవంతో స్వతంత్రంగా జీవించాలని, సమాజంలో వారికి పూర్తి భాగస్వామ్యం కల్పించేందుకు విద్యావకాశాలు మెరుగు పరచాల్సి ఉందని సిఎం జగన్ నమ్మారని పేర్కొన్నారు. అందులో భాగంగానే రిజర్వేషన్లు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వికలాంగులు విద్యను పొందేందుకు ఆలస్యమ్యే అవకాశం ఉందని అందుకోసం విద్యాసంస్థల్లో ప్రవేశాలకు గరిష్ట వయోపరిమితి ఐదేళ్ల సడలింపు ఇచ్చామని పేర్కొన్నారు.



మోచా దాటికి కకావికలమైన సిట్వే టౌన్‌షిప్

మయన్మార్‌పై విరుచుకుపడ్డ మోచా

- ముగ్గురి మృతి

న్యూఢిల్లీ : బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుపాన్ మయన్మార్‌లో అల్లకల్లోలం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రంలోని సిట్వే టౌన్‌షిప్‌కు సమీపంలో మోచా తీరాన్ని దాటింది. గంటకు 209 కిలోమీటర్ల వేగంతో తీరం దాటిందని మయన్మార్ వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. తీరం దాటిన సమయంలో గాలులు, భారీ వర్షాలు కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక భవనాలు, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు, సెల్‌ఫోన్ టవర్లు కూలిపోయాయి. రహదారులు దెబ్బతిన్నాయి. అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం తూర్పు షాన్ రాష్ట్రంలోని తాచిలిక్ టౌన్‌షిప్‌లో కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడడంతో ఇద్దరు మరణించారు. సెంట్రల్ మాండలే రీజియన్‌లోని ఫైన్ ఊల్విన్ టౌన్‌షిప్‌లో మర్రిచెట్టు కూలడంతో దాని కింద పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. భారీ వర్షాలకు దేశంలోని అనేక వీధులు, సెల్లార్లు జలమయమయ్యాయని అధికారులు తెలిపారు. సెల్‌ఫోన్ టవర్లు నేలకూలడంతో టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయమేర్పడింది. రవాణా స్తంభించింది. 2008 మేలో వచ్చిన నర్గీస్ తుపాను మయన్మార్‌ను అతలాకుతలం చేసింది. దేశంలో ఇర్రవాడి నది డెల్టా చుటూ ఉన్న గ్రామాలు, పట్టణాలను నాశనం చేసింది. సుమారు 1,38,000 మంది మరణించారు. పదివేల ఇళ్లు, ఇతర భవనాలు నేలమట్టమయ్యాయి. మోచా తుపాను మయన్మార్ వైపు మళ్లడంతో బంగ్లాదేశ్‌కు, భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌కు ముప్పు తప్పినట్లయింది. మోచా తుపాను తీరం దాటిన తరువాత మూడు, నాలుగు గంటల్లోనే బలహీన పడినట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది.

పోలవరంపై ఢిల్లీకి అఖిలపక్షం

- రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు నిధులను కేటాయించకుండా కేంద్రంలోని మోడి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని అఖిలపక్షపార్టీలు, ప్రజా సంఘాలు ధ్వజమెత్తాయి. పోలవరం ప్రాజెక్టుపై కేంద్రాన్ని నిలదీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అఖిలపక్షాలను డిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశాయి. ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షతన పోలవరంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలు రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు హాజరై పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరిని ఎండగట్టాయి.

ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు నరహరశెట్టి నరసింహారావు, సామాజిక విశ్లేషకులు టి లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును సత్వరం పూర్తి చేసేందుకు రూ 29,374కోట్లను విడుదల చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశి భూషణ్ కుమార్ లేఖ రాస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం రూ 1,429కోట్లు మాత్రమే ఇవ్వాల్సి వుందని బాధ్యతారాహిత్యంగా ప్రకటన చేయడం తగదని విమర్శించారు. కేంద్రం ప్రకటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోరుమెదపకపోవడం సరైంది కాదన్నారు. ఈ అంశంపై సిఎం తక్షణం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపక్రమించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల ఎత్తును మొదటి దశ పేరుతో 41.15 మీటర్లకు తగ్గించి నిర్మాణాలను చేపట్టడం సరైందికాదన్నారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు పూర్తిగా అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు నష్టపరిహారం తమకు సంబందంలేదని కేవలం ప్రాజెక్టు స్ట్రక్షర్ నిర్మాణానికి మాత్రమే నిధులను ఇస్తామని కేంద్రం అంటుంటే రాష్ట్ర ప్రభుత్వం నోరుమెదపకపోవడం తగదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం నిధులను కేంద్రం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచేలా తక్షణం ఢిల్లీకి అఖిల పక్ష ప్రతినిధులను తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, ప్రసాద్, పోతుల బాలకోటయ్య తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, వేదికపై దేవినేని ఉమా, వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ తదితరులు

రాష్ట్రంలో 47 డిగ్రీలు

- ప్రజలు అప్రమత్తంగా వుండాలి
- తీవ్ర వడగాల్పుల ముప్పు
- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో ఎండల తీవ్రత విపరీతంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలుచోట్ల సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు నుండి నాలుగు డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల నుండి 47 డిగ్రీల దాకా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని 173 మండలాల్లో వడగాడ్పుల ముప్పు పొంచివుందని తెలిపింది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీలు నమోదయ్యే వీలుందన్నారు. ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట మండలంలో 44.8, ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తెలుగులోనే పరిపాలనా వ్యవహారాలు

తెలుగు భాషోద్యమ సమాఖ్య సభలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాలలో పరిపాలనా వ్యవహారాలను తెలుగులోనే జరపాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ కోరారు. ఆదివారం తెలుగు భాషోద్యమ సమాఖ్య, మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'పాలనా వ్యవహారాలలో తెలుగుభాష' అనే అంశంపై సభ జరిగింది. తెలుగు భాషోద్యమ సంఘం అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మండలి బుద్ధప్రసాద్, తెలుగు భాషోద్యమ సమాఖ్య నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, సామర్ల రమేష్‌బాబు, ఎంబివికె ట్రస్ట్ ఛైర్మన్ పి మధు మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన ఉద్యమంతోనే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదం ముందుకు వచ్చిందని అన్నారు. ఇపుడు ఒకే దేశం, ఒకే భాష, ఒకే పన్ను పేరుతో ప్రజలపై బలవంతంగా హిందీని రుద్దేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు.

రాష్ట్రంలో 1964లో వావిలాల గోపాల కృష్ణయ్య నాయకత్వంలో తెలుగు అధికార భాషగా వుండాలనే ఉద్యమం పురుడుపోసుకుందని తెలిపారు. ఎన్‌టిఆర్ హయాంలో పాలనలో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులో వుండాలని ఆదేశాలు జారీ చేస్తే కిరణ్‌కుమార్‌రెడ్డి సిఎంగా వున్నపుడు అధికారభాష సంఘాన్ని ఏర్పాటు చేసి ఛైర్మన్‌ను నియమించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని వాణిజ్య, వ్యాపార సముదాయాలకు ఇంగ్లీష్‌లో పేర్లు వుంటున్నాయని, వాటిని తెలుగులోకి మార్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా రంగాన్ని మొత్తం కార్పొరేట్‌కు కట్టబెట్టడంతో తెలుగుభాష కనుమరగుయ్యే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలలో వారి మాతృభాషలోనే పరిపాలనా వ్యవహారాలు నడుస్తున్నాయని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా పై నుంచి కింది స్థాయి వరకు తెలుగు భాషలోనే పరిపాలనా వ్యవహారాలు వుండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఉత్పత్తిలో జెన్‌కో రికార్డు

- ఒక్క రోజులోనే

5,137 మెగావాట్ల ఉత్పత్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉత్పత్తిలో ఎపి పవర్ జనరేషన్ కార్పొరేషన్(జెన్‌కో) సరికొత్త రికార్డు సృష్టించింది. 105.620 మిలియన్ యూనిట్ల(5137 మెగావాట్లు) విద్యుత్ ఉత్పత్తిని ఒక్కరోజులోనే నమోదు చేసింది. శుక్రవారం (ఈ నెల 12వ తేది) అర్ధరాత్రి 12 నుంచి శనివారం (13వ తేది) అర్ధరాత్రి 12 గంటల వరకు 114 మిలియన్ యూనిట్ల(ఎంయు) విద్యుత్ ఉత్పత్తి జరిగింది. జెన్‌కో వినియోగానికి పోనూ 105.620 ఎంయులను గ్రిడ్‌కు సరఫరా చేసింది. రాష్ట్రవిభజన తర్వాత ఒక్కరోజులో ఇదే అత్యధిక ఉత్పత్తి కావడం విశేషమని జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అన్ని విధాలుగా సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, కేంద్ర రైల్వే, బొగ్గు మంత్రిత్వ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించినందుకు జెన్‌కో ఉద్యోగులను అభినందించారు. విజయవాడ థర్మల్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంలో నిర్మించిన కొత్త యూనిట్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దిగువ సీలేరులో మరో 230 మెగావాట్ల ఉత్పత్తికోసం రెండు యూనిట్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టి ఏడాదిలో పూర్తిచేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

ఇహెచ్‌టి సబ్‌స్టేషన్‌లలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలు

ఎక్స్‌ట్రా హైటెన్షన్ (ఇహెచ్‌టి) సబ్‌స్టేషన్‌లలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. దీనిపై జెన్‌కో ఎండి చక్రధర్‌బాబుతో కలిసి ఆదివారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌కో జెఎండి చక్రధర్ బాబు మాట్లాడుతూ 70 సబ్‌స్టేషన్‌లలో అమలు చేసేందుకు ఎపి ఇంధన పరిరక్షణ సమితితో ఎంవోయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. విజయవాడ జోన్‌లోని గుంటూరు, ఒంగోలు, కృష్ణా, నెల్లూరులోని ఉన్న స్టేషన్లలో ఇప్పటికే ఇంధన సామర్థ్య పరికరాలు అమర్చడం పూర్తయిందని తెలిపారు. ఈ చర్యలతో పాటు ప్రసార నష్టాలను 2.8 శాతం కంటే తగ్గించేందుకు ట్రాన్స్‌కో చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జెఎండి (విజిలెన్స్) బి మల్లారెడ్డి, డైరెక్టర్లు ఎవికె భాస్కర్, టీ వీరభద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిషింగ్ హార్బర్‌లో ఆధునీకరణ పనుల నిలిపివేత

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ ఫిషింగ్ హార్బర్‌లో రూ.151 కోట్లతో కొన్ని రోజులుగా చేపడుతున్న ఆధునీకరణ పనులకు ఈ నెల 11 నుంచి బ్రేక్ పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50 శాతం షేర్ ధనంతో చేపట్టే ఈ పనులు విశాఖ పోర్టు ఆధ్వర్యంలో సాగిన విషయం తెలిసిందే. అయితే ఈ నెల 9న 'ప్రజాశక్తి' ప్రధాన సంచికలో 'మత్స్యకారుల పొట్టగొడుతున్న కేంద్రం' శీర్షికన ఓ కథనం ప్రచురితమైంది. తాజాగా చేపడుతున్న పనులు వల్ల మత్స్యకారులకు ఉపయోగం లేదన్న విషయంపై ఈ కథనం సాగింది. దీంతో మత్స్యకారులు, మత్స్యకార సంఘాలు అప్రమత్తమయ్యాయి. జిల్లా అధికార యంత్రాంగం, కలెక్టర్ డిపిఆర్‌పై, ఆధునీకరణ పనులపై నివేదిక కోరినట్లు తెలిసింది. మరోవైపు మత్స్యకార సంఘాల ప్రతినిధులు కూడా హార్బర్‌లో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా పోర్టు యాజమాన్యం ఆధునీకరణ పేరిట సంప్రదాయ మత్స్యకారులను వేధిస్తోందంటూ మండిపడుతున్నారు. ఫ్లోటింగ్ జెట్టీల పని నిలుపుదల చేయాలని, తమ ఉత్పత్తులకు గిరాకీ పెంచేలా కనీసం నాలుగు ఫింగర్ జెట్టీలు నిర్మించి మత్స్యకారులకు కోల్డ్‌స్టోరేజీ, ప్లాట్ ఫారాల సౌకర్యం కల్పించాలని వారంతా కోరుతున్నారు. దానికి భిన్నంగా ప్రస్తుత డిపిఆర్ ఉందని, గెస్ట్‌హౌస్‌లు, టూరిస్ట్‌లకు వసతుల దిశగా లాడ్జిల తరహా రూమ్‌ల నిర్మాణం చేపట్టేందుకు పోర్టు అధికారులు డిపిఆర్ సిద్ధం చేసిన క్రమంలో పత్రికలో కథనం రావడం, మత్స్యకారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఆధునీకరణ పనుల నిలుపుదలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్టు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. దీంతో, మత్స్యకారులకు ప్రయోజనకరంగా ఉండే నివేదిక దిశగా కసరత్తు జరిగే అవకాశాలున్నాయి.

కక్ష సాధింపు చర్యలు తగవు : పత్తిపాటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని భూముల వ్యవహారంలో చంద్రబాబు నివాసంతో పాటు టిడిపి నేతల ఆస్తులను జప్తు చేయడం సరికాదన్నారు. సిఎం జగన్ కక్షసాధింపు చర్యల్లో భాగమే చంద్రబాబుపై సిట్ దర్యాప్తు అని తెలిపారు. అమరావతి రాజధాని రాజకీయాలకు అతీతమైందని, ఆర్5 జోన్ పేరుతో రైతులకు, బడుగులకు మధ్య ప్రభుత్వం చిచ్చుపెడుతోందని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్‌లోనే ఆర్-3 జోన్‌లో 1700 ఎకరాలను రెండు లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి టిడిపి హయాంలో కేటాయించిందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి రాజధానికి వలస వచ్చే పేదలకు ఈ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తే 48 వేల మందికి ఇల్లు ఇస్తామని అదీ ఒక సెంటు భూమి మాత్రమే ఇస్తామని ముఖ్యమంత్రి పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాజధాని రైతులు పేదల ఇళ్ల స్థలాలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన సంగతి గుర్తెరగాలని అన్నారు.

అత్యాచార దోషులను శిక్షించాలి

- చంద్రబాబు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన కుప్పం నియోజకవర్గం పెద్దతండా వైసిపి సర్పంచ్‌పై వెంటనే కేసు నమోదు చేసిన చర్యలు తీసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. 'అధికార పార్టీలో ఉన్నాం. తమను ఎవరూ ఏమీ చేయలేరనే అహంకారం'తోనే ఇలాంటి వాళ్లు తెగబడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై దారుణాల విషయంలో పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

20న హైదరాబాద్‌లో ఎన్టీఆర్ శతజయంతి సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బిలోని ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లో సభ జరగనుంది. ఈ కార్యక్రమ నిర్వహణపై చంద్రబాబుతో ఎన్టీఆర్ సావనీర్, లిటరేచర్, వెబ్‌సైట్ కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సభలో ఎన్టీఆర్‌పై ప్రత్యేక సంచికను, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నట్లు కమిటీ ఛైర్మన్ టిడి జనార్ధన్ చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా కమిటీకి చంద్రబాబు పలు సూచనలు చేశారు. కాగా జర్నలిస్ట్ భగీరథ రాసిన నాగలాదేవీ పుస్తకాన్ని చంద్రబాబు హైదరబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. దాదాపు 16 ఏళ్ల పరిశోధన చేసి నాగలాదేవీ పుస్తకాన్ని తీసుకొచ్చారని రచయిత భగీరథను చంద్రబాబు అభినందించారు.

నేటి నుంచి ఇఎపిసెట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఆన్‌లైన్‌లో జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,37,733 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపిసి విభాగం అభ్యర్థులకు 15 నుంచి 18వ తేది వరకు, 22,23 తేదిల్లో బైపిసి అభ్యర్థులకు రోజుకు రెండు సెషన్‌లో పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 136 పరీక్షా కేంద్రాలను, 47 రీజనల్ కేంద్రాలను ఎపిఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసింది. అభ్యర్థులు ఉదయం సెషన్‌లో 7.30 నుంచి 9 గంటల మధ్య, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి 3గంటల మధ్య మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. పరీక్ష ప్రారంభమైన తరువాత ఏవరిని లోపలికి అనుమతించరు. అభ్యర్థులేవరూ గోరింటాకు,మెహాందీ, ఇంక్ వంటి వాటిని చేతులకు, కాళ్లకు పెట్టుకొని రావొద్దని ఎపి ఉన్నత విద్యామండలి ఇప్పటికే మార్గదర్శకాలను వెల్లడించింది. హాల్ టిక్కెట్‌తో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారంతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును, ఎస్సి విద్యార్థులు కుల ధృవీకరణ పత్రాన్ని కూడా తెచ్చుకోవాలని వివరించారు.

సవరణ

'బిజెపికి భారీ షాక్' శీర్షికన ఈ నెల 14న మొదటిపేజీలో కాంగ్రెస్ 136 స్థానాల్లోనూ, బిజెపి 65 స్థానాల్లోనూ గెలిచినట్లు ప్రచురితమైంది. కాంగ్రెస్ 135 స్థానాలు, బిజెపి 66 స్థానాలు గెలిచినట్లు చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి

- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులు సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసి ఉత్తీర్ణత శాతం మరింత పెంచే దిశగా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. స్కూల్ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంవత్సరంలో ఆగస్టు 15 నుంచి జనవరి 15 వరకు విద్యార్థులకు చాలా కీలకమని చెప్పారు. మార్గదర్శకాలను అనుసరించి ప్రతి వారంలో నిర్దేశించిన సిలబస్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తికాకపోతే పరీక్ష సమయంలో విద్యార్థులకు భారంగా మారుతుందన్నారు. సకాలంలో సిలబస్ పూర్తిచేయడం ద్వారా విద్యార్థుల పునశ్చరణకు అవకాశం ఉంటుందని, పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

నిర్దిష్ట పనివేళలు అమల్జేయాలి

- శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇతర సెక్రటరీల మాదిరిగానే తమకు కూడా నిర్దిష్ట పని వేళలు అమల్జేయాలని గ్రామ, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు కోరారు. అలాగే యూజర్ ఛార్జీల వసూళ్ల నుంచి తమకు విముక్తి కల్పించాలని విన్నవించారు.

ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జానిపాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ హరి, కార్యదర్శి సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వార్డు శానిటేషన్ సెక్రటరీలకు యూజర్ ఛార్జీల టార్గెట్ల పేరిట వేధింపులు, సస్పెన్షన్లు ఆపాలని పురపాలక శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మొండి బకాయిలున్న కొందరు యూజర్ ఛార్జీలు చెల్లించకపోతే శానిటేషన్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమనే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు.

నేడు దివ్య కల్యాణోత్సవం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 15న సోమవారం సాయంత్రం శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్ల దివ్యకల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. కుంకుమార్చన చేసిన పసుపు, కుంకుమ, గాజులు, మహిళా భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలి

- స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి నమ్మి రమణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 773వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐరన్ ఓర్ గనులు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి అధిక ధరకు కొనుగోలు చేసి ముడిసరుకును తెచ్చుకోవాల్సి వస్తోందని, రవాణా ఛార్జీలు తడిసి మోపుడవుతున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు రావడానికి ఇది కూడా ఒక కారణమని పేర్కొన్నారు. సుమారు మూడు లక్షల కోట్ల రూపాయల విలువైన ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఈ కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తే ఎవ్వరూ అంగీకరించరని, పోరాటాలను మరింత ఉధృతం చేస్తారని తెలిపారు. దీక్షల్లో యూనియన్ నాయకులు ఎస్.కృష్ణ, ఎఆర్‌ఎం.ఆంజనేయులు, శ్యామ్ కూర్చున్నారు.

నకిలీ పూజారిపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరులో ముగ్గురు యువతులపై దారుణానికి పాల్పడ్డ నకిలీ పూజారిని, అందుకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ప్రభావతి, డి రమాదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు రాష్ట్ర సర్వతోముఖాభివద్ధికి శ్రీలక్ష్మి మహాయజ్ఞం నిర్వహిస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తూ, మరోవైపు ఆడపిల్లలకు కనీస రక్షణ కల్పించలేని దుస్థితిలోకి రాష్ట్రాన్ని నెడుతోందని ఐద్వా నాయకులు విమర్శించారు. గుంటూరులో జరిగిన నగ్న పూజలు ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. అమాయకపు ఆడపిల్లలకు రక్షణ కల్పించలేని యజ్ఞయాగాదులు ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారో రాష్ట్ర ప్రభుత్వం తెలపాలని డిమాండ్ చేశారు. దిశ చట్టం పేరుతో త్వరితగతిన విచారణ అంటున్నారు కానీ ఆచరణలో కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శించారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ విచారణకు పంపి నకిలీ పూజారీపై తక్షణం చర్యలను తీసుకోవాలని కోరారు. దగాపడిన యువతులకు అండగా నిలిచి వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్న జగన్

- టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నివాసముంటున్న ఇంటిని రాష్ట్ర ప్రభుత్వం సిఐడికి అటాచ్ చేయడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపైకి ఎసిబి, సిఐడి వంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతూ కేసులు బనాయిస్తుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం ప్రభుత్వ భూమిలో ఉందని ఒకసారి, అక్రమకట్టడమని మరోసారి, ఇప్పుడు క్విడ్‌ప్రోకో అంటూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. రాజకీయ కక్షసాధింపులపై జగన్ చూపుతున్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు రక్షించడంలో చూపడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, వివేకా హత్యకేసులో అవినాష్ అరెస్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, జగన్ సైకో చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు.

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితర టిడిపి నాయకులు కూడా జగన్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని ఆరోపణలు చేశారని, జరగలేదని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. నాలుగేళ్ల నుంచి అమరావతిపై అక్రమ కేసులు పెట్టిన జగన్ సాధించిందేంటని వారు ప్రశ్నించారు. క్విడ్ ప్రోకో అనేది జగన్‌కు బాగా తెలుసనని నాడు తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని క్విడ్‌ప్రోకో ద్వారా రూ.43 వేల కోట్లు కొల్లగొట్టిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు.

స్టేలకు వెళ్లకుండా విచారణను ఎదుర్కో!

- చంద్రబాబుకు పేర్నినాని సవాల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా నది కరకట్టపై లింగమనేని గెస్ట్‌హౌస్‌ను క్విడ్ ప్రోకోలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తీసుకున్నారని, ఈ కేసులో ధైర్యం వుంటే స్టేల కోసం కోర్టులకు వెళ్లకుండా విచారణను ఎదుర్కోవాలని మాజీ మంత్రి పేర్ని నాని సవాలు విసిరారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లింగమనేని గెస్ట్‌హౌస్‌ను రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం అటాచ్ చేసిందన్నారు. గతంలో ఈ గెస్ట్‌హౌస్‌ను లింగమనేని రమేష్ ప్రభుత్వానికే ఇచ్చినట్లు చంద్రబాబే చెప్పారని ఆయన గుర్తు చేశారు. అమరావతి భూకుంభకోణాల కేసులపై కోర్టు స్టేలు తొలగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో తప్పులు చేసిన వారు ఏస్థాయిలో వున్నా చర్యలు తప్పవన్నారు. అమరావతి కుంభకోణాలపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధారాలతో సహా పిటీషన్ వేశారని ఆ మేరకు సిఐడి విచారణకు పూనుకుందని తెలిపారు. ఈ విచారణలో లింగమనేని రమేష్, ఇతర వ్యక్తులకు లబ్ధి చేకూరేలా వ్యవహరించినట్లు తేలిందన్నారు. లింగమనేని రమేష్ లబ్ధి పొందిన దానికి ప్రతిఫలంగా చంద్రబాబునాయుడుకు కరకట్ట గెస్ట్ హౌస్ ఇచ్చిన్నట్లుగా సిఐడి గుర్తించిందన్నారు. ఈ గెస్ట్‌హౌస్‌ను పూలింగ్‌లో ఇచ్చినట్లు ఆధారాలు ఎక్కడా లేవన్నారు. అలాంటప్పుడు చంద్రబాబు ఆ ఇంటిలో ఉచితంగా ఎందుకు ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు, చంద్రబాబుకు ఇద్దరికీ లింగమనేని రమేష్ బినామీ అని పేర్ని ఆరోపించారు. తమ ప్రభుత్వం తపులను ఉపేక్షించదని చంద్రబాబు స్టేలకు వెళ్లకుండా విచారణకు సిద్ధం కావాలని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు

మొదటి పేజి తరువాయి

ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్మికుల కుటుంబాలను రొయ్యల పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిగ్నల్, డివైడర్లు లేని కారణంగానే ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో సిగ్నల్స్, చొల్లంగి నుంచి ఎదురులంక వంతెన వరకు మధ్యలో డివైడర్ తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పవన్‌కల్యాణ్ దిగ్భ్రాంతి

తాళ్లరేవు రోడ్డు ప్రమాదం పట్ల జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కష్టజీవులైన ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రమాదంలో క్షతగాత్రులైన వారికి వైద్య ఆరోగ్యశాఖ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లాలో అవుకు జలాశయంలో పర్యాటకశాఖ పడవ బోల్తాపడి ఇద్దరు మృతి చెందడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పర్యాటక ప్రదేశాల్లో అవసరమైన మేర రక్షణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చిరుత దాడిలో తొమ్మిది గొర్రెలు మృతి

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

గొర్రెల మందపై చిరుత దాడి చేసి తొమ్మిది గొర్రెలను చంపింది. ఈ సంఘటన అనంతపురం జిల్లా రాయదుర్గం మండల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాశీపురం గ్రామానికి చెందిన ఉలిరాజుకు చెందిన గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. ఈ దాడిలో తొమ్మిది గొర్రెలు మృతిచెందాయి. మరో మూడు గొర్రెలు గాయపడ్డాయి. సుమారు లక్ష రూపాయలకుపైగా నష్టం వాటినట్లు బాధితుడు తెలిపారు. ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్న విషయాన్ని గతంలోనే ఫారెస్ట్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుత బారినుంచి తమను కాపాడాలని కాశీపురం గ్రామస్తులు కోరుతున్నారు.


గంగమ్మకు సారె తీసుకొస్తున్న మంత్రి రోజా దంపతులు

గంగమ్మకు మంత్రి రోజా సారె అందజేత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్ :

తిరుపతి శ్రీతాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా, సెల్వమణి దంపతులు తమ కుటుంబంతో కలిసి ఆదివారం అమ్మవారికి సారె సమర్పించారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మంత్రి రోజా మాట్లాడుతూ ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన తాను, తిరుపతి గంగమ్మ తల్లిని స్కూల్‌డేస్ నుంచి దర్శించుకుంటూనే ఉన్నానని అన్నారు. అప్పటికీ ఇప్పటికీ ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా తమ గురువుగారైన భూమన కరుణాకర రెడ్డి బ్రహ్మాండంగా అభివద్ధి చేశారని కొనియాడారు. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఇఒ మునికృష్ణ పాల్గొన్నారు.


విన్యాసాల్లో పాల్గొననున్న భారతీయ నౌక ఐఎన్ఎస్ కవరత్తి

'సముద్ర శక్తి' విన్యాసాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఇండియా-ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా సముద్ర శక్తి-23 విన్యాసాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భారత నౌకా దళం తరపున స్వదేశీయంగా రూపొందిన ఐఎన్ఎస్ కవరత్తి ఈ విన్యాసాల్లో పాల్గొనేందుకు ఇండోనేషియా తీరానికి చేరుకుంది. ఈ నౌకలో భారత నౌకాదళం డోర్నియర్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, చేతక్ హెలికాప్టర్ ఉన్నాయి. ఈ విన్యాసాల్లో ఇండోనేషియా నేవీకి చెందిన కెఆర్ఐ సుల్తాన్ ఇస్కందర్ ముడా, సిఎన్ - 235 మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎఎస్ - 565 పాంథర్ హెలీకాప్టర్ పాల్గొననున్నాయి. సముద్ర శక్తి విన్యాసాలతో ఇరుదేశాల నౌకాదళాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడనున్నాయని నేవీ అధికారులు తెలిపారు.

పొత్తులు చూసి వైసిపి భయపడదు

- పవన్ కల్యాణ్ ముందు గెలుస్తారో లేదో ఆలోచించాలి : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పొత్తులను చూసి భయపడే పరిస్థితి వైసిపికి లేదని రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి, రాయలసీమ వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అనంతపురంలోని నియోజకవర్గాలలో మూడురోజులుగా ఆయన చేపట్టిన పార్టీ సమీక్షలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మీడియాతో పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏ పార్టీలు పొత్తులు పెట్టుకున్నా వైసిపి భయపడన్నారు. తమ పార్టీ గతంలో మాదిరిగానే రాబోయే ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పారు. రాజకీయంగా తాము ఊతకట్టి లేకుండా టిడిపిలాగా నడవలేని స్థితిలో లేమని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో తమకు వచ్చిన 151 స్థానాల కంటే మెరుగైన ఫలితాలే 2024 ఎన్నికల్లో వస్తాయని జోస్యం చెప్పారు. పవన్ కల్యాణ్ గెలుస్తారో లేదో ఆలోచన చేసుకోవాలని సూచించారు.

పదేళ్లుగా పెరగని పరిహారం

- పంట నష్టానికి అరకొరగా ఇన్‌పుట్ సబ్సిడీ
- పెట్టుబడి వ్యయం పెరిగినా కనికరించని ప్రభుత్వం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, కరువు, వరదలు, అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న సమయంలో రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో రాష్ట్రంలో గత పదేళ్లగా ఒకే విధానం కొనసాగుతోంది. వరి, వేరుశనగ, పత్తి, చెరకు పంటలకు హెక్టారుకు రూ.15 వేలు చొప్పున అందిస్తున్నారు. మొక్కజొన్నకు రూ.12,500, పప్పుదినుసులు, ప్రొద్దుతిరుగుడు, సోయాబిన్, గోధుమకు రూ.10 వేలు, జొన్న, రాగి, సజ్జ, ఆముదం, నువ్వు పంటలకు హెక్టారుకు రూ.6,800 పరిహారంగా నిర్ధారించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ విధంగా నిర్ణయించారు. 2015లో టిడిపి ప్రభుత్వం స్వల్పమార్పులతో ఈ విధానాన్నే కొనసాగించింది. 2019లో వరి, వేరుశనగ, పత్తి, చెరకు వంటి ప్రధాన పంటలకు హెక్టారుకు రూ.20 వేలు ఇవ్వాలని ఎన్నికల ముందు నిర్ణయం తీసుకున్నా, ఆచరణలో అమలుకు


ఇటీవల వర్షాలకు పెదకూరపాడులో దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్ ఫొటో)

నోచుకోలేదు. వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పాత ఉత్తర్వులనే కొనసాగిస్తోంది. గత పదేళ్లలో పంటలకు పెట్టుబడి వ్యయం 200 శాతం వరకు పెరిగింది. ఎకరాకు వరికి రూ.40 వేలు వరకూ, పత్తికి రూ.50 వేలు, జొన్న, మొక్కజొన్న, ఇతర పప్పుదినుసులకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ ఖర్చు అవుతోంది. కౌలు రైతులు పంటల పెట్టుబడి వ్యయంతోపాటు, కౌలు భారాన్నీ భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏటా ఇన్‌పుట్ సబ్సిడీపై సమీక్షించి, పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా పెంచాల్సి ఉంది. ఇది జరగకపోవడంతో రైతులకు అరకొరగా సాయం అందుతోంది. పరిహారం అందజేతకు విధించిన నిబంధనలు రైతులకు ప్రతిబంధకంగా ఉన్నాయి. పంట 33 శాతానికిపైగా దెబ్బతింటేనే పరిహారం ఇస్తున్నారు. పంటను కోసిన తర్వాత వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగితే పరిహారం ఇవ్వడం లేదు. పంట నష్టం జరిగిన వెంటనే అధికారులు పరిశీలన చేయకుండా జాప్యం చేస్తున్నారు. దీనివల్ల మొదట ఉన్న తీవ్రత ఆ తర్వాత కనిపించక నష్టం అంచనాల్లో తేడా వల్ల రైతులకు పరిహారం అందని పరిస్థితులు ఉంటున్నాయి. పంట నష్టపోయిన రైతులను గుర్తించేందుకు ఇ-క్రాప్ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇ-క్రాప్‌లో పేరులేని కౌలు రైతులకు పరిహారం అందడం లేదు. పొలాల్లో ఇసుక మేటలు వేస్తే హెక్టారుకు రూ.12,200, నేల కోతకు గురైతే రూ.37,500 ఇస్తున్నారు. నిబంధనలను సడలించాలని, పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలని రైతులు కోరుతున్నారు.

మరోసారి చలో విజయవాడ ఆలోచన రానీయొద్దు

- రాష్ట్ర జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మరో చలో విజయవాడ ఉద్యమం చేయాలనే ఆలోచన తలెత్తక ముందే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పారాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిరంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ వరకు రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలు, 23 మంది ఎంపిలకు 'ఉద్యోగుల ఆవేదనను చెబుదాం అనే కార్యక్రమం' ద్వారా ఎపి జెఎసి విన్నవించనుందని తెలిపారు. ఈ నెల తొమ్మిదిన శ్రీకాకుళంలో మొదటి ప్రాంతీయ సదస్సు నిర్వహించామన్నారు. ఈ నెల 17న అనంతపురం జిల్లాలో, 27న ఏలూరులో, జూన్ ఎనిమిదిన గుంటూరులో ప్రాంతీయ సదస్సు నిర్వహించి జూన్ 30న ఒక్క రోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అప్పటిలోగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయి డబ్బులు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ ఆర్ఎన్ దివాకరరావు, ప్రధాన కార్యదర్శి పిఎస్ ఖాన్, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుల్లాయప్ప, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వర్‌రావు, విఆర్ఒ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సాంబశివరావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.


తమ వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు

విహార యాత్రలో విషాదం

- అవుకు రిజర్వాయర్‌లో పర్యాటక బోటు బోల్తా
- ఇద్దరు మృతి - ఒకరు గల్లంతు

ప్రజాశక్తి-అవుకు (నంద్యాల జిల్లా)

విహార యాత్రలో విషాదం చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్‌లో టూరిజం బోటు బోల్తాపడి ఇద్దరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోవెలకుంట్ల పోలీస్ కానిస్టేబుల్ దూదేకుల రసూల్ తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి 14 మంది అవుకు రిజర్వాయర్‌లో జలవిహారం చేసేందుకు టూరిజం శాఖకు చెందిన బోటు ఎక్కారు. రిజర్వాయర్‌లో కొద్ది దూరం వెళ్లేసరికి బోటు లోపలికి ఒక్కసారిగా నీళ్లు రావడంతో బోటు బోల్తా పడింది. దీంతో, బోటులో ఉన్నవారంతా నీటిలో పడిపోయారు. రిజర్వాయర్ వద్ద ఉన్న కొంతమంది స్థానికులు గమనించి నీళ్లలో పడిపోయిన వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 14 మందిలో 12 మందిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. కానిస్టేబుల్ రసూల్ కుమార్తె సాజిత (20), ఆయన అన్న కుమార్తె ఆసియాబి (23) నీటిలో మునిగిపోయారు. వీరిలో ఆసియాబి ఒడ్డుకు తీసుకొచ్చిన అనంతరం చనిపోయారు. సాజిత నీటిలో గల్లంతయ్యారు. నూర్జహాన్ (33) అనే మహిళతోపాటు చిన్నారులు చెస్విక్, హనీ పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నూర్జహాన్ మృతి చెందారు. డోన్ ఆర్‌డిఒ వెంకటరెడ్డి, డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, కోవెలకుంట్ల సిఐ ఆదినారాయణరెడ్డి, బనగానపల్లె ఇన్‌ఛార్జి సిఐ ప్రియతమ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

యువగళం@100రోజులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారానికి వంద రోజులు పూర్తి చేసుకోనుంది. 400 రోజుల్లో నాలుగు వేల కిలోమీటర్లకు చేరుకోవాలని పాదయాత్ర ప్రారంభించిన లోకేష్ ముందుకు అడుగులువేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన యాత్ర ఇప్పటివరకు 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1269 కిలోమీటర్లు సాగింది. వంద రోజుల్లో 32 బహిరంగ సభలు, వివిధ సామాజిక తరగతుల 87 ముఖాముఖి కార్యక్రమాలు, హలో లోకేష్ పేరిట నాలుగు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 45 రోజులు, ఉమ్మడి అనంతపురంలో తొమ్మిది నియోజకవర్గాల్లో 23 రోజులు, ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటివరకు 11 నియోజకవర్గాల్లో 32 రోజులు యువగళం పాదయాత్ర కొనసాగింది. వందరోజుల్లో రాతపూర్వకంగా లోకేష్‌కు 1900 వినతిపత్రాలు అందగా, దారిపొడవునా వేలాది మంది ప్రజలు ఆయనను కలిసి తమ కష్టాలు చెప్పుకున్నారు. వంద రోజుల ప్రయాణంలో మూడుసార్లు మాత్రమే సెలవులు తీసుకోవాల్సి వచ్చింది. శని, ఆదివారాల్లోనూ లోకేష్ పాదయాత్రను కొనసాగిస్తున్నారు.



1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదోని మైలురాయి వద్ద లోకేష్ , తదితరులు (ఫైల్)

సెల్ఫీ ఛాలెంజ్‌తో అధికార పార్టీ ఉక్కిరిబిక్కిరి!

యువగళం పాదయాత్ర దారిలో టిడిపి హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల తాలుకూ విజయగాథలు, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ లోకేష్ విసురుతున్న సెల్ఫీ ఛాలెంజ్‌లు అధికార పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పెనుగొండలో పాలసముద్రం కియా ఫ్యాక్టరీ వద్ద యువనేత విసిరిన సెల్ఫీ చాలెంజ్ ఇప్పటివరకు యాత్రలో హైలైట్‌గా నిలచింది. టిసిఎల్, జోహో, డిక్సన్ వంటి కంపెనీల వద్ద లోకేష్ సెల్ఫీ ఛాలెంజులు విసిరారు.

సెల్ఫీ విత్ లోకేష్‌తో కార్యకర్తల్లో నూతనోత్సాహం

ప్రతిరోజూ తనను కలవడానికి వచ్చే కార్యకర్తలు, అభిమానులతో సెల్ఫీ విత్ లోకేష్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి అనూహ్య ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు యువనేత లోకేష్ 1.40 లక్షలమంది అభిమానులతో ఫొటోలు దిగారు. తీవ్రమైన భుజం నొప్పి రావడంతో సెల్ఫీలు వద్దని వ్యక్తిగత వైద్యులు లోకేష్‌కు సూచించారు. అభిమానులను నిరాశపర్చకుండా ప్రత్యామ్నాయంగా సెల్ఫీ దిగిన వారి ఫొటోలను స్కానింగ్ చేయించి, ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా వారి ఫోన్లకే చేరేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతోపాటు దారిపొడవునా తనను కలిసేందుకు వచ్చిన వారితో ఫొటోలు దిగుతూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచారు.


చెక్కు అందజేస్తున్న నాదెండ్ల మనోహర్

బిజెపి, టిడిపితోనే పొత్తు

- జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రానున్న ఎన్నికల్లో బిజెపి, టిడిపితోనే పొత్తులు ఉంటాయని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వైసిపి విముక్తి ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జనసేన పార్టీ పనిచేస్తోందని, ఆ దిశగానే రానున్న ఎన్నికల్లో కలిసొచ్చే పార్టీలతో ప్రయాణం చేస్తుందన్నారు. ఒంగోలులోని మౌర్య హోటల్లో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందని విమర్శించారు. చేసిన పనులకు బిల్లులు రాక వైసిపి నేతలే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొంటామన్న ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. పర్యవసానంగా రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. రాష్ట్రానికి పూర్వవైభవం రావాలంటే వైసిపి పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడమే మార్గమని అన్నారు. అనంతరం కొండపి నియోజకవర్గం, శింగరాయకొండ మండలానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త ప్రసాద్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.ఐదు లక్షల చెక్కును పార్టీ తరుపున అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నగర అధ్యక్షులు మలగా రమేష్, వివిధ నియోజకర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీ కాఫీకి గిరాకీ


గిరిజన ప్రాంతంలో సాగవుతున్న కాఫీ

- అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్
- డౌనూరులో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రయత్నం

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గిరిజన ప్రాంతంలో పండిస్తోన్న కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గిరిజనుల నుంచి సేకరించే కాఫీ పరిమాణం పెంచాలనే, దానికయ్యే ప్రాసెసింగ్ ఖర్చును తగ్గించుకోవాలనే యోచనలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఉంది. పాడేరు ఏజెన్సీలో గిరిజన రైతులు పండిస్తున్న కాఫీని భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. గతేడాది (2022-23) ప్రయివేటు వ్యాపారుల కంటే ఎక్కువ ధర చెల్లించింది. ఎక్కువ పరిమాణంలో కాఫీని కొనుగోలు చేసింది. మంచి ఫలితాలు సాధించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 150 టన్నుల కాఫీని సేకరించిన జిసిసి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్ల విలువైన వెయ్యి టన్నులు కొనుగోలు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో పాడేరు ఏజెన్సీలోని ఆర్గానిక్ కాఫీకి మంచి డిమాండ్ ఉంది. దీంతో, గిరిజనులకు చెల్లించే ధర పెంచి కొనుగోలు చేసినా, జిసిసి ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. గత ఏడాది పార్చుమెంట్ కాఫీ కిలోకు రూ.285, చెర్రీ కాఫీ కిలోకు రూ.145 చొప్పున చెల్లించింది. రూ.20 కోట్ల టర్నోవర్‌తో సాధించిన కోటిన్నర లాభంలో రూ.50 లక్షలు వరకు సిఎస్ఆర్ కింద కాఫీ గింజలు ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్లను గిరిజనులకు అందజేయాలని ఆలోచిస్తోంది.

కొత్త ప్రయత్నాలు

కాఫీ ప్రాసెసింగ్‌కు పెడుతున్న ఖర్చును తగ్గించుకొనేందుకు డౌనూరులో ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పెట్టేందుకు జిసిసి ప్రయత్నిస్తోంది. ప్రాసెసింగ్, రోస్టింగ్, గ్రైండిగ్ చేయడం ద్వారా ప్రాసెసింగ్ ఖర్చు తగ్గించుకోవడానికి ప్రణాళికలు రూపొందించింది. కాఫీకి మార్కెట్లో మంచి ధర, మరింత నాణ్యమైన కాఫీని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. యూనిట్ ఇక్కడ ప్రారంభిస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. బెంగళూరులో ప్రాసెసింగ్ చేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా ఖర్చు తగ్గించుకోవాలని, కాఫీ పండిస్తున్న గిరిజనులకు లాభాలను వివిధ రూపాల్లో ఇవ్వాలని జిసిసి యోచిస్తోంది. ఎరువులు ఉపయోగించకుండా పండిస్తున్న కాఫీకి జిసిసి ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇస్తోంది. ఇప్పటివరకు చింతపల్లి మండలంలోని 2,210 ఎకరాలు, జికె.వీధి మండలంలోని 3,435 ఎకరాల్లో కాఫీని సాగు చేస్తున్న 1300 మంది రైతులకు చొప్పున ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇచ్చింది.

త్వరలో ప్రాసెసింగ్ యూనిట్



డౌనూరులో ఐదెకరాల స్థలంలో నాలుగు కోట్ల విలువైన కాఫీ ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను వీలైనంత తొందరగా ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. ఈ యూనిట్ వల్ల కాఫీ గ్రేడింగ్‌లో మరింత నాణ్యత పెరిగి అంతర్జాతీయ మార్కెట్లో కాఫీకి గిరాకీ పెరుగుతుంది. జిసిసికి ప్రాసెసింగ్ ఖర్చు తగ్గుతుంది. వచ్చిన లాభాలను కాఫీ రైతుల అవసరాలకు వినియోగించవచ్చు.

-జి.సురేష్ కుమార్, జిసిసి ఎమ్‌డి

జాతీయ స్థాయిలో ఎయుకి తొమ్మిదో ర్యాంక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



అఖిల భారత స్థాయిలో మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీకి తొమ్మిదో ర్యాంక్ లభించింది. ది వీక్ హంస రీసెర్చ్ సర్వే - 2023 భారత దేశ అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను తాజాగా విడుదల చేయగా దానిలో ఎయుకి ఈ గుర్తింపు దక్కింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి టాప్ - 10లో రెండు విశ్వవిద్యాలయాలు మాత్రమే ఈ ర్యాంకింగ్‌లో నిలబడ్డాయి. 521 స్కోర్‌తో ఆంధ్రవిశ్వవిద్యాలయం టాప్ 10లో స్థానం పదిలపరచుకుని తన సత్తా చాటింది. కొద్దికాలంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోంది. అఖిల భారత స్థాయిలో తన సత్తా చాటుతోంది. బోధన, పరిశోధనలకు ప్రాధాన్యత కల్పిస్తూ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాలలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా నిలుస్తోంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలోనూ లేని విధంగా చెయిర్ ప్రొఫెసర్‌లను ఎయు కలిగి ఉంది. ఇటీవల జరిగిన ప్లేస్‌మెంట్‌లో అత్యధికంగా రూ 84.5 లక్షల వేతనాన్ని ఎయు విద్యార్థి సాధించారు. ప్లేస్‌మెంట్స్ విషయంలో ఇంజినీరింగ్ కళాశాలకే పరిమితం కాకుండా సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, న్యాయ కోర్సుల్లోనూ వేల సంఖ్యలో అందించే విధంగా ప్రత్యేక ప్రణాళికతో ఈ వర్సిటీ పనిచేస్తోంది. వీటితో జాతీయ స్థాయిలో ప్రాభవం పెరిగింది. భవిష్యత్తులో ఎయు మరిన్ని అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకునే అవకాశముందని విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి తెలిపారు.

ఎడ్యుకేషన్ వరల్డ్ సర్వేలో ఎపిలో మెదటి స్థానం

ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ 2023-24 విద్యాసంవత్సరానికి భారత దేశంలోని ప్రభుత్వ మల్టీ డిసిప్లీనరీ విశ్వవిద్యాలయాలపై జరిపిన సర్వేలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో మొదటి స్థానంలోనూ, అఖిల భారత స్థాయిలో 29వ స్థానంలోనూ నిలిచింది.


ఉత్సవాల ప్రారంభంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను శతకం పట్టులో కొలువుదీర్చే కార్యక్రమంతో నిర్వాహకులు మూడురోజుల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమ్మవారిని శతకం పట్టు వద్దకు తీసుకువెళ్లేందుకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, జెసి జె.శివశ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, జడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిన్నయ్యదొర, కొట్టగుల్లి సుబ్బారావు, నవర కొండబాబు తదితరులు ఉత్సవ విగ్రహం, పాదాలను ఆలయం నుంచి ఊరేగింపుగా మెయిన్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన శతకంపట్టుకు తీసుకువచ్చి అక్కడ కొలువుదీర్చారు. ఊరేగింపులో డప్పు కళాకారులు ఆకట్టుకున్నారు. థింసా నృత్యాలు అలరించాయి. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.


ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి

- యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే మళ్లీ ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలో కొనసాగింది. నల్లకాల్వ చెంచు కాలనీ క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర వెలుగోడు మీదుగా బోయరేవుల విడిది కేంద్రం వరకూ సాగింది. వెలుగోడు అటవీ ప్రాంతంలో ఇండియా వైల్డ్ లైఫ్ కన్సర్వేషన్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఇమ్రాన్ సిద్ధిఖీ, సీనియర్ జర్నలిస్ట్ పులిపాక బాలు పులుల సంరక్షణపై లోకేశ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అడవులను, పులులు, ఇతర వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అడవులు తరిగిపోవడం వల్లే విపరీత వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. టిడిపి హయాంలో అడవుల సంరక్షణ కోసం అనేక చర్యలు తీసుకున్నామన్నారు.

రాష్ట్రంలో టైగర్ ఎకో టూరిజం ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని ఆలోచనతో ముందుకు వెళ్తామని తెలిపారు. అడవుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని, శ్రీశైలం టైగర్ రిజర్వ్ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక ధరలు తగ్గిస్తామని, జిల్లా కేంద్రంగా నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, పాత విద్యుత్ స్లాబ్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు వైఎస్ఆర్ స్మృతివనం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి లోకేష్ నివాళులర్పించారు. పాదయాత్రలో మాజీ మంత్రి ఎన్ అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ ఇంఛార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



చరిత్రతో మాకేం పని ..!

కామధేనువు కావల్సినన్ని
పాలిస్తావుంటదని నమ్మిస్తవుంటే
ఇంటెనక పాడిగెదిచ్చే పాలు
పావుశేరంటవేందీ?
అక్షయపాత్రలో ఆహారం
అదే పనిగా వురతావుంటదని
మేము చెబుతావుంటే
పేదోడి సత్తుగిన్నెలో పాచిముద్దకు
దిక్కులేదంటవేమీ?

ఇప్పటికే కష్టపడి చరిత్ర తలనరికి మొలకీ
మొలదీసి ముఖానికీ అంటిస్తావుంటే
చీరకట్టి సింగారిస్తానంటివే
చరిత్రతో మాకేం పనిబడ్యా
మా చరిత్ర మాకుండాది గదా !?

ఓరీడెవుడ్రా..,!
సర్ జాన్ మార్షలంటా
వున్నోడు వున్నట్టుండక
ఇండస్ వ్యాలీ సివిలైజేషన్ని
తవ్వి తీస్తావుండాడు
ఒబ్బిడిగా పేర్చిన కట్టుకథలన్నీ
ఒక సంస్కృతిగా నిర్మించుకుంటా వుంటే
నిజాల్ని మేమొప్పుకుంటమా ఏమీ?!

మనుషులంతా దేవుడికే పుట్టారని
దేశాన్ని ఒప్పించేదానికి
యమయాతన పడతావుంటే
ఈడెవుడే డార్విననంటా
జీవ పరిణామ సిద్ధాంతాన్ని చెబుతావుండాడు
అట్టాంటోనితో మాకేం పనీ
అందుకే పుస్తకాల్లోంచి పీకిపారేస్తా వుండాం

నిన్న మీదగా నేడు
నేటిని దాటుకుంటా రేపటిదాకా
మంత్రం చదివి సందించిన బాణం
వెలుగులు పూయిస్తదని చెబుతావుంటే
ఈ థామసాల్వా ఎడిసనొకడు
బల్బును చూయించి
మంత్రశక్తిని నిర్వీర్యం చేస్తనంటే ఎట్టొప్పుకుంటం
చీకట్లో మగ్గేదానికైనా సిద్ధమే గదో !


– బంగార్రాజు కంఠ
85003 50464



కొండనాల్క పెరిగింది

మేం ఉదయాన్నే కాఫీ తాగుతాం
ప్రపంచ బ్యాంకు అప్పు పుచ్చుకున్నంత ఆనందంగా
మేం ప్రభాతనడక కూడ చేస్తాం
రింగ్ రోడ్డు చుట్టూ చెమట పట్టేంత వరకూ
స్నానం గురించిన చింత చీమంతైనా లేదు
ఇన్ని ప్రాజెక్టుల శంకుస్థాపనల సాక్షిగా..
విపక్షాలది వొట్టి లొల్లి కేళే గాని
సానుకూల దృక్పథం కోల్పోయిన ప్రగతివాదులు వీళ్ళు
కాంట్రాక్టులన్నాక కొన్ని మర్యాదలుంటాయి
ఇంటల్లుడి గౌరవానికి లోటు రాకూడదు
మేనమామ హక్కులకి భంగం వాటిల్లరాదు
కన్నాం కాబట్టి పిల్లల్ని గూర్చి ఆలోచించాల్సిందే
కాదన్నదెవరు..?
ప్రజాస్వామ్యం అంటే పంచుకోవడమే కదా–
భూములైనా కాంట్రాక్టులయినా
కొల్లగొట్టే చౌరస్తాలయినా
ఎంతకీ ఎర్రగడ్డల రాజకీయాలేనా–
చర్చించడానికి సమస్యలు చాల వున్నాయి
గోదావరి కొత్తపాయ పారుతుంది
ఆలస్యమైన ప్రాజెక్ట్ కుండకు చిల్లిపడింది
సామూహిక శత్రువు కొండనాల్క పెరిగింది
తోకపట్టి వెనక్కి లాగితే ఏం ప్రయోజనం..?
ఆర్థికమండళ్ళు వెల్లివిరిస్తేనే కదా
స్విస్ బ్యాంకులో శ్రీమహాలక్ష్మి విప్లవ తాండవం..!

– డాక్టర్ పెరుగు రామకష్ణ
98492 30443



మోకరిల్లిన క్షణాలు

మనం ఫ్రాంజ్ కాఫ్కా యొక్క ద్ఘుఖం
నీషే తత్వం
దోస్తోవ్ స్కీ అన్వేషణ
ఎమిల్ సియోరాన్ అమరత్వం
ఆల్బర్ట్ కామూ యొక్క మానవత
మరియు కార్ల్ మార్క్స్ యొక్క కల
ఇంకా అజ్ఞాత కవి రాసిన విషాద రాతలం
మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న
సంగీతకారుడి విషాదపు గీతాలం
వణుకుతున్న చేతితో వాన్ గోగ్ గీసిన గీతలం మనందరం

గాంధీ చెప్పినట్టు చెంపదెబ్బలు తింటున్నవాళ్ళం
సందుల్లో విషాదపు గోడలం
భయంతోనూ, ఒత్తిడితోను ఉన్న ప్రతి ఒక్కరు
సరదాగా గడిపినవాళ్ళ ఉపన్యాసాలలో
చివరి వరుసలో కూర్చొని
మన ఉనికిని గుర్తించేవాళ్ళం

మనం రాత్రికి స్నేహితులం
బాధలు, నిజాలు ఎవరికీ తెలియనివ్వనివాళ్ళం
సినిమాలో విషాదకరమైన సన్నివేశం చూసి ఏడ్చేవాళ్ళం
ఒంట్లో నెత్తురు తక్కువైనవాళ్ళం
మనకేం కావాలో కూడా తెలియని ప్రాచీన మెదడులం
ఇంకా స్థిరపడలేకపోతున్నాం!
మనం ఐక్యత గురించి తెలిసిన
అంబేద్కర్ రచనల్లో మాత్రమే కలుసుకునే
ఒంటరివాళ్ళం!

– శాంతయోగి యోగానంద

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti



ఏ భాష చెణుకైనా
ఏ యాస చినుకైనా
తనలోన కలుపుకొని
తరలింది తెలుగు

- సినారె


ప్రపంచీకరణ అమానవీయతను వివరించిన కథలు

సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ మన జీవితాల్లోకి చొచ్చుకొని వచ్చి మనకు తెలియకుండానే మనల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈనాటి జీవితాలని దాన్ని నడిపిస్తున్న చలన సూత్రాలను అర్థం చేసుకోవడం కష్టం. అర్థం చేసుకుని వీటిని కథలుగా మలచుకోవడం మరీ కష్టం. అందుకని సమాజం గురించే కాకుండా, ఆ సమాజం వెనుక ఉన్న శక్తుల్ని గురించి కూడా తెలుసుకోవడం అవసరం. సామాజిక బాధ్యతను గుర్తించిన రచయితలు మాత్రమే అలాంటి కథలను రాయగలరు. ఇలాంటి రచయితల్తో వివిన మూర్తి ఎప్పుడూ ముందు వరుసలో ఉంటాడు.

సమీక్ష

ఇతర రాజ్యాల మీదికి దండయాత్ర చేసి వారిని నిర్మూలించి, తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడంతో సరికొత్త నాగరికత వెలిసిందని చరిత్రకారులు నమోదు చేస్తారు. కానీ దాని వెనుక ఉన్న అన్యాయం, అమానుషం, ఘోరమైన హత్యాకాండ కనిపించకుండా పోతుంది. చరిత్ర ఎప్పుడూ విజేతల పక్షానే నిలుస్తుంది. ఎప్పటికప్పుడు కొత్తగా కనిపెట్టిన ఆయుధాలు విజయాన్ని, ఆధిక్యతను తెచ్చి పెడతాయి. నీ ఆయుధమే నాగరికత. నీకు గిట్టని వాళ్ళని అనాగరికులని, దుర్మార్గులని, ప్రజా కంటకులనే పేరుతో తరిమేయవచ్చు. నాశనం చేయొచ్చు. అనాది నుంచి ఇదే కొనసాగుతోంది. ఆర్యుల దండయాత్ర మొదలు మహాభారతంలోని ఖాండవ దహనం వరకు ఎన్నో ఉదాహరణలను చూడొచ్చు. ఆధునిక కాలంలో ప్రపంచంలోనే అజేయ శక్తిగా రూపొందిన అమెరికా రాజ్య స్వభావంలో, వియత్నాం మొదలుకొని ఇరాక్‌పై చేసిన దండయాత్రలలో ఇదే యుద్ధ నీతి కనబడుతుంది. ఒకప్పుడు మతం కోసం జరిగిన యుద్ధాలు ఇప్పుడు వనరుల దోపిడి కోసం జరుగుతున్నాయి. ఇది అందరికీ తెలిసినా తెలియనట్టే నటించడం ఓ విషాదం. ఈ వ్యంగ్య కథనాన్ని 'కృష్ణ స్వప్నం' కథలో చూడవచ్చు.

రాజులు పోయినా, నియంతలు మారినా, ప్రజాస్వామ్యం వచ్చినా దోపిడీ నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. బలవంతుడు బలహీనుడిని దోచుకుంటూనే ఉన్నాడు. పాలకులు, పీడితులు అనే స్పష్టమైన విభజనను ఇప్పుడు మనం చూడవచ్చు. మేకలు ప్రజలు. అధికారం, నాయకత్వం ముసుగు వేసుకున్న దోపిడీదారులు పులులు. పులులను, మేకలను ఒకే రేవులో నీరు తాగించడం అసంభవం. కాలం మారుతున్న కొద్దీ, అభివృద్ధి జరుగుతున్న కొద్ది దోపిడీ స్వభావం మారుతుంది. రకరకాల రూపాల్లో దోపిడీదారులు బయలుదేరుతారు. మేకల తరఫున నాయకత్వం వహించిన వాళ్లు పులులతో రాజీ పడతారు. లేదా లోపాయికారీగా కలిసిపోతారు. స్వాతంత్రం రావడం అంటే అధికార మార్పిడి జరగడమే. పీడనకు తెల్లదొరలు పోయి నల్ల దొరలు వచ్చారు. స్వపరిపాలన, అభివృద్ధి, దేశభక్తి పేరిట ప్రజలను ఏమార్చి వాళ్లను దోచుకోవడం మరింత సులభతరమైంది. మేల్కొన్న ప్రజలు వాళ్ళ నాయకులను వాళ్లే తయారు చేసుకుంటాం అనడంతో కొత్త శకం ప్రారంభం అవుతుందనే ఆశావాదంతో 'సమవర్తి' కథ ముగుస్తుంది.



వలసలు, ఆక్రమణలు, యుద్ధాలు చేసి సామ్రాజ్యవాదం విస్తరించింది. ఇప్పుడు ఇతర దేశాలకు వెళ్లి యుద్ధాలు చేసి, ఆ దేశాలను పరిపాలించాల్సిన అవసరం లేదని డబ్బు బలంతో, ఇతర దేశాలను రిమోట్ కంట్రోల్ పద్ధతిలో చాలా సులువుగా పరిపాలించవచ్చని నూతన సామ్రాజ్య వాద దేశాలు తెలుసుకున్నాయి. వాళ్ల పెట్టుబడిదారీ తత్వాన్ని ప్రోత్సహించడానికి, ప్రచారం చేయడానికి అంతర్జాతీయ సంస్థలు ఏర్పడ్డాయి. సామ్రాజ్యవాదం యొక్క తత్వం మారిపోయి ప్రపంచీ కరణ పేరుతో ముందుకు వచ్చింది. దీనివల్ల దాదాపు 150 సంవత్సరాలు పోరాడి కార్మికవర్గం సాధించుకున్న అన్ని హక్కులూ పోయాయి. దాదాపు అన్ని ఉత్పత్తి రంగాలూ ప్రైవేటు పెట్టుబడిదారుల చేతుల్లోకి మళ్లాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుకు, కార్మికులకు మధ్య ఉన్న సంబంధాల గురించి 'పాడుకాలం' నవలిక చర్చిస్తుంది. వారిద్దరి మధ్య ఉన్న శత్రు వైరుధ్యాలను వివరిస్తుంది.

మీనాంబికా ఇండస్ట్రీస్‌కు కొత్తగా మేనేజర్‌గా వచ్చిన గంగూలీకి, పాత మేనేజర్ అంబలగన్‌ను కార్మికులు చితకబాదితే, వాడు పారిపోగా ఆ పోస్ట్ తనకిచ్చారని తెలుసు. ముందుగా కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలనుకుంటాడు. ఫోర్‌మెన్లను, ఇన్చార్జిలను పిలిచి కార్మికులను కంట్రోల్ చేయాల్సిన బాధ్యతను గుర్తు చేస్తాడు. పదిమంది సూపర్వైజర్‌లను బాగా చూసుకుంటే వాళ్ళు 1200 మందిని పిండి పనిచేస్తారని అతని నమ్మకం. కార్మికులను మచ్చిక చేసుకోవడానికి ఓటి పద్ధతిని ప్రవేశపెడతాడు. ఓటి మీద యజమాని గంగోలిని ప్రశ్నిస్తే 'కార్మికుడు ఓటీ ఆశతో మామూలు సమయంలో రికార్డు పని చేయించగలిగితే మనకి లాభం కాదా! ప్రపంచంలో ఏం జరుగుతున్నది తెలుసుకునే సమయంలో కూడా రోజుకి 12 గంటలకు పైగా ఫ్యాక్టరీలో ఉంచితే మనకి లాభం కదా. వాళ్లని జీతభత్యాల కోసం మాత్రమే పోరాడేవాళ్లుగా మార్చడంలో ఆధునిక పెట్టుబడిదారుడు ఎంత విజయం సాధించాడో, వాళ్లని ఎన్ని గంటలు కట్టిపడేసి మరమనుషులుగా మార్చడంలోనూ అంత విజయం ఉందని' నచ్చ చెబుతాడు. కార్మికులు డబ్బుల కోసం పడే పాట్లు, తాగుడు లాంటి అలవాట్లతో ఇంటిని సరిగా నడప లేకపోవడం– అప్పులు, చీటీలు, తాగుడు గొడవలు, ఓటీలు, ప్రమోషన్లకై చేసే ప్రయత్నాలను ఇలా కార్మికులకు సంబంధించిన అన్ని విషయాలను ప్రస్తావిస్తూ వివిన మూర్తి ఈ నవలిక రాశారు.

సరళీకృత ఆర్థిక విధానాలు కార్మికుల జీవితాల్ని అతలాకుతలం చేశాయి. ప్రైవేటైజేషన్ శరవేగంగా అమలవడంలో పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మారుతీ కంపెనీ ఉద్యోగస్తులు ప్రైవేటైజేషన్ ప్లాన్స్‌ని వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తుంటారు. దానిపై రామోస్ మోటార్స్ జనరల్ మేనేజర్ గంగూలీ మాట్లాడుతూ... ఎంప్లాయిస్‌కి ఉద్యోగ భద్రత మీద ఆందోళన సహజం. అయితే ప్రైవేటు పరిశ్రమల కింద మాత్రమే బతకతప్పదని వారు గ్రహిస్తారు. అలవాటు పడతారు. పెట్టుబడిదారుడికి కూడా సమ్మెలతో, ట్రేడ్ యూనియన్‌తో సహజీవనం తప్పదన్న జ్ఞానం ఉంటుంది. వాటితో వ్యవహరించే అనుభవమూ ఉంటుంది.' 'ప్రపంచవ్యాప్తంగా కార్మికుల కండిషన్స్ ఒకటి కావు. కలిగిన దేశాల్లో కార్మికులు, పేద దేశాల కార్మికులతో కలిసే అవకాశం లేదు. పెద్ద కంపెనీల వాళ్ళు చిన్న కంపెనీల వాళ్ళతో కలవలేరు. మేథోశ్రమ చేసే వాళ్ళకి ఇచ్చే జీతాలు, వాళ్ల కార్మికులేనన్న అభిప్రాయమే కలుగనీయవు. సంఘటిత రంగంలోని కార్మికులు ఎప్పటికీ అసంఘటిత రంగంలోని కార్మికుల గురించి పట్టించుకోరు. ఆ కార్మికులను సంఘటిత పరిచి బతికేవాళ్ళు, వీళ్లను సంఘటిత పరచడంలో చనిపోయే వాళ్ళ మీద చూపే కనీస సానుభూతి కూడా చూపించరు. అంతో ఇంతో ఉద్యోగం ఉన్నవాళ్లు, అసలు లేని వాళ్ళ గురించి ఆలోచించే అవకాశమే లేదు. వివిధ పార్టీలు కార్మికుల్లో తమ పట్టును చూపెట్టడానికైనా సొంత కార్మిక యూనియన్లు పెట్టుకోక తప్పదు. అందుకోసం అవసరమైతే వాడుకోవడానికి అనేక భాషలు, మతాలు ఉన్నాయి" అని కార్మికుల్లో ఉన్న అనైక్యత గురించి చెబుతాడు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల కార్మికుల జీవితాలు ఎన్ని ఒడిదుడుకులకు గురవుతాయో ముందే హెచ్చరిస్తూ 95లో రాసిన ఈ కథ ప్రాసంగికత ఇప్పుడు మరింత గట్టిగా వ్యక్తమవుతోంది.

ఫ్యాక్టరీలను జాతీయం చేద్దామంటాడు కమ్యూనిస్టు. మార్కెట్లను అంతర్జాతీయం చేసేద్దామనుకుంటాడు క్యాపిటలిస్ట్. మార్కెట్లను అంతర్జాతీయం చేయడం అంటే మార్కెట్లపై నియంత్రణ ఎత్తివేత. విదేశీ వస్తూత్పత్తుల ప్రవేశానికి మార్గం సుగమం చేయడం. విదేశీ ఉత్పత్తులతో పోటీ పడలేని సంస్థలు తమ దుకాణాలను మూసివేయక తప్పదు, లేదా వాటిలో లీనమైపోవాలి. కుట్రలు, కుతంత్రాలు చేసి అయినా ప్రత్యర్థుల ఉత్పత్తి కంపెనీలను దెబ్బ తీసి, తమకు పోటీ లేకుండా చూసుకొని, తమ ఉత్పత్తుల గిరాకీని పెంచుకున్న ఉదంతాన్ని 'మాయ– మహామాయ' కథలో చూడవచ్చు.

ప్రజలకు ఉచితంగా అందజేయాల్సిన విద్య, వైద్య రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, వాటిని ప్రైవేటు పరం చేసేసింది. సేవా భావాన్ని మరిచిపోయిన ఆధునిక వైద్యం పూర్తిగా వ్యాపారమయమై పోయింది. ప్రభుత్వ నియంత్రణ, పాపభీతి లేకుండా ఆధునిక ఆసుపత్రులు ప్రజలను దోపిడీ చేస్తున్నాయి. ప్రచారం, ఆడంబరం, అట్టహాసాలతో గొలుసుకట్టుగా కార్పొరేట్ ఆసుపత్రులు ప్రారంభమవుతున్నాయి. ఆధునిక వైద్య సదుపాయాల పేరిట పేషంట్లను నిలువు దోపిడీ చేస్తూ, మానవత్వాన్ని మంటగలుపుతున్న రీతి 'దిశ' కథలో కనిపిస్తుంది.

'స్పృహ' కథలో– తన మనసులోని వేదన, అశాంతి నుంచి బయటపడటానికి శేఖరం కవిత్వాన్ని వాహికగా చేసుకుంటాడు. విప్లవోద్యమంలో చేరి అడవుల వెంట తుపాకీ పట్టుకొని తిరిగాడు. ఇదంతా గతం. ప్రస్తుతం ప్రసిద్ధ తెలుగు వార, మాసపత్రిక 'ప్రకాశం' సంపాదకుడు, బిజినెస్ మేనేజర్‌గా వెలిగిపోతుంటాడు. ఒకసారి హైదరాబాద్‌లో జరిగిన స్త్రీవాదుల సమావేశంలో కరుణ చేసిన ఉపన్యాసం, వాదనా పటిమ అతడిని ఎంతగానో ఆకర్షిస్తుంది. ఆమెతో కలిగిన పరిచయంలో తన జీవితంలోని వేదనను, అశాంతిని వెళ్లగక్కి, సేదతీరి తనను తాను ప్రక్షాళనం చేసుకుంటాడు. ఈ పెద్ద కథ ప్రధానంగా ఫెమినిజంపై చర్చ పెట్టినా– పత్రికలు, సంపాదకులు, కవులు, రచయితలు, స్త్రీవాదులపై వేసిన విసుర్లు, చర్చలతోనే కొనసాగుతుంది.

సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ దుష్పరిణామాలను – అవి మన జీవితాల్లో తెస్తున్న సంక్షోభాన్ని, కల్లోలాన్ని వివిన మూర్తి కథలు అద్భుతంగా ఆవిష్కరించాయి. ఇవి పైకి మామూలు కథల్లా కనిపించినా, అంతర్లీనంగా రచయిత తాను చెప్పదలుచుకున్న వాటికి చర్చావేదికగా ఉపయోగించుకోవడం బాగా వచ్చింది. కొన్ని కథలు అంతరార్థక కథలుగా, కొన్ని మల్టీ లేయర్ కథలుగా కనిపిస్తాయి. 'కృష్ణ స్వప్నం' కథలో కనిపించిన ప్రతీకాత్మకత, మ్యాజిక్ రియలిజం ఆ కథను మంచి వ్యంగ్య కథగా తీర్చిదిద్దాయి. సమాజంలోని అన్ని విషయాలను, వ్యక్తుల మధ్య అంతరాలను, వారిలో పొడసూపే రకరకాల ధోరణులను చర్చకు పెట్టిన ఈ కథలు ఆసక్తికరంగా ఉండి మనల్ని ఆలోచింపజేస్తాయి.

– కె.పి.అశోక్ కుమార్

వాళ్లనొక్కసారి చూడాలని వుంది!

వాళ్లెక్కడికి పోయుంటారు?
వాళ్లనొక్కసారి మళ్లీ చూడాలనుంది

ఆ వీధిలో కడుగుపెడితే చాలు
పడుగు పేకల ఆకలి సంగీతం
నా గుండె తలుపు తట్టేది
ఎన్ని పోగులతికించినా
తమ ఆకలి పోగులతకకపోవటం
నా గుండెను మెలిపెట్టేది
వెన్నెల దారాల్ని సాపు చేసి
మన చిరుగుల సిగ్గుల్ని కప్పేసే
చందమామల్ని తయారు చేసేవాళ్లు
నా చిరుగుల బాల్యానికి ప్రేమగా కుట్లేసి
నన్ను సగర్వంగా వీధుల్లో తిప్పేవాళ్లు

ఆకలి పేగుల అరుపుల మధ్య
నగ్న దేహాలకు మెరుపులు తొడిగి
ఊరు ఊరంతా అందంగా ముస్తాబు చేసేవాళ్లు
అగ్గిపెట్టెలో అద్భుతమై ఒదిగిన వాళ్లు
తమ కుక్షికి ఒక్క మెతుకైనా ఎరగనివాళ్లు

వాళ్లింకా ఆ వీధిలోనే వుండి వుంటారా?
ఎన్ని పోగులతికించినా
తమ ఆకలి పోగుల్ని అతికించలేని
బతుకు మగ్గాన్ని వదిలేసి
వలస పక్షుల్లా ఎగిరిపోయుంటారా?
ఎక్కడ నూకల కోసం
పావురాల్లా పరితపిస్తున్నారో
ఎక్కడ విరిగిన మగ్గాలను తలపోస్తూ
నిత్య గాయాలవుతున్నారో
ఎక్కడ తెగిన బతుకు పోగుల్ని
కడుపులోని ఆకలి పేగులతో
కలల షటిల్లో దారంలా
ఆసుపోసుకుంటున్నారో !

లోకానికొక ఆకాశమంత
నీలి వస్త్రాన్ని తయారు చేసి
మెరిసే నక్షత్రాలు, రంగు రంగుల పూలు కుట్టి
బహుకరించిన వాళ్లు
తమ దేహానికి జానెడు గుడ్డెరుగని వాళ్లు

వాళ్లిప్పుడెక్కడుండి వుంటారు?
వాళ్లు ఖాళీ చేసిన వీధిప్పుడు
లేగదూడల్ని కోల్పోయిన
తల్లి ఆవులా భోరుమంటోంది!
వాళ్ల శిథిల గృహాలు కత్తిరించిన గుడ్డపేలికలై
శూన్యానికి వేలాడుతున్నాయి

వాళ్లనొక్కసారి తిరిగి
ఆ వీధిలో చూడాలనుంది
శిథిల గృహాలను పునర్నిర్మించి
వాళ్ల కలల యంత్రాలను మళ్లీ
ప్రతిష్ఠించాలని వుంది
ఆధునిక యంత్రాల ఇనుప పాదాల కింద
దారప్పోగుల్లా నలిగిపోయిన వాళ్లు
శిథిల వస్త్రాల్లా మిగిలిపోయినవాళ్లు
వాళ్లెక్కడ చిక్కిపోయుంటారు?
దారాలు పిగిలిన వస్త్రాలై
ఏ నిరాదరణ సుడిగాలికి చెదిరిపోయుంటారు?
వాళ్లనొక్కసారి మళ్లీ చూడాలనుంది!

– చిత్తలూరి
91338 32246

బాలల్లో ఆలోచనాశక్తిని పెంచే 'వన దేవత తీర్పు'

'పుస్తకం పిల్లల చేతిలో అలంకారంగా మారాలి అని పరితపించే రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు. ఆయన కలం నుంచి వెలువడే బాలల కథల సంపుటే 'వన దేవత తీర్పు'. ఈ సంపుటిలో ఇరవై కథలున్నాయి. ప్రతి కథ సమాజ హితంతో బాలల శ్రేయస్సు కోరి రాసినదే. కొన్ని కథలు నీతిని ప్రబోధిస్తే మరికొన్ని హేతువాద దృక్పథం కలిగిస్తాయి. ఇంకా కొన్ని కథలు పిల్లల్లో ఆలోచన రేకెత్తించేవిగా ఉన్నాయి. కథల్లో విజ్ఞానం వినోదం సరేసరి!



'సామాన్యుడి సమస్య' కథ సామాన్యుడి సమస్యను తేలికగా తీసుకుని పట్టించుకోకపోతే ఆ సమస్య పెద్దదై సమస్యను పట్టించుకోని పెద్దలకు పెను సవాల్‌గా మారగలదని చెబుతుంది. 'కుందేలు ప్రచారం – నక్క మోసం' కథ భ్రమపడిన సంఘటన ఎలా ప్రచారమై ఒక మూఢనమ్మకంగా మారుతుందో విశదీకరిస్తుంది. లోకంలో సాధారణంగా మహిమల ప్రచారం ఇలాగే కొనసాగుతాయన్న సత్యాన్ని కథ ద్వారా చెప్పి పిల్లల్లో హేతువాద దృక్పథం కలిగించడానికి రచయిత ప్రయత్నించారు. హేతువాద దృష్టితో రాసిన మరో కథ 'వదల బొమ్మాళీ...వదల'. ఈ కథలో ఒక ఊరి చివర చింత చెట్టుపై భూతముందని నిరక్షరాస్యులైన ఆ ఊరి ప్రజల్లో నమ్మకం కలిగిస్తాడు ఒక భూత వైద్యుడు. ఆ భూతం పోవడానికి పూజ చేస్తానంటాడు. అందుకు ఐదు వేల రూపాయలు ఇమ్మంటాడు. అంతలో ఆ ఊరి బడిపంతులు వచ్చి భూతం గుట్టు రట్టు చేసి అలా మోసపోవడానికి చదువు లేక పోవడమే కారణమని చెప్పి పిల్లలను బడికి పంపించేలా ఆ ప్రజల మనస్సులను మార్చుతాడు. భూతం గుట్టు ఎలా రట్టయిందో తెలుసుకోవాలంటే ఆ కథ చదివి తీరాల్సిందే.

మరికొన్ని కథల్లోని వెళ్తే... మోసం చేయ బోయి మంత్రి పన్నిన యుక్తితో దొరికిపోయిన మోసగాళ్ళ కథ 'మరచెంబు సాక్ష్యం.' మరొక కథ 'సార్ధకత'. ఈ కథలో ఇతరులకు మేలు చేసే వారి జీవితం ధన్యమని చెప్పడానికి మర్రి గింజతో కథ నడిపి రచయిత కృతకృత్యులయ్యారు. 'అపోహ అంటే' కథ ద్వారా పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించడానికి రచయిత ప్రయత్నించారు. బల్లి పడిన ఆహారం విష మయం కాదని, బల్లి సూర్యకాంతి తగలని ప్రాంతంలో ఉండడం వల్ల దాని చర్మంపై 'సాల్మొనెల్లా' రకానికి చెందిన బ్యాక్టీరియా విపరీతంగా పెరుగుతుందని అది ఆహారంలో కలియడం వల్ల ఆ ఆహారం తిన్న వారికి వాంతులు, విరేచనాలు అవుతాయని చెప్పడం బాగుంది.


పుస్తకం

'మాట తీరు' వ్యక్తిత్వ వికాస కథ. 'కుక్క తోక' సామాజిక న్యాయం చెప్పే కథ. 'వనదేవత తీర్పు' ఫాంటసీ కథ. ఎవరికీ ఆశ పెట్టి మోసపరచరాదని చెప్పే కథ. ఇలా 'వనదేవత తీర్పు' బాలల కథా సంపుటిలో ప్రతి కథ బాలల మానసిక వికాసానికి తోడ్పడేదే. ప్రతి కథకు ముందు చక్కని రంగుల బొమ్మతో పిల్లల మనసులను కథ వైపు ఆకట్టుకునేలా చేసే తీరులో తుంబలి శివాజీ చిత్రాలు ఉన్నాయి. ఒక మంచి పుస్తకం ప్రచురించిన నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ వారికి, పుస్తక రచయిత నారంశెట్టి ఉమా మహేశ్వరరావు గారికి అభినందనలు.

– బెలగాం భీమేశ్వరరావు
99895 37835

అక్షర చినుకుల కవిత్వ మాల

మనసులోని భావాలకు, ఊహలకు మాటలతో కాకుండా అందమైన కవిత్వంతో అల్లిన అలతి పదాలతో అనుభూతినొందే అక్షర కావ్యంలా 'చినుకు తాకిన నేల' కవితా సంపుటిని వెలువరించారు కవయిత్రి శాంతికృష్ణ. కవిత్వం ఓ ప్రవాహమై పరవళ్ళు తొక్కింది. ఈ కవిత్వం చదువుతుంటే ప్రతి కవితా ఓ చిరుజల్లులా మన మనసును తడిపేస్తుంది.



బంధాలు అనుబంధాలతో పాటు ప్రకృతిలోని అందమైన దృశ్యాల వర్ణన కళ్లకు కడతాయి. 'గురువంటే నాన్నే' అనే కవితతో ప్రారంభించి నాన్నకు తన మనసులోని స్థానాన్ని చాటుకున్నారు. 'నాన్నంటే హిమోన్నత శిఖరమే/ వినయమే విజయానికి సోపానమని/ ఎంత ఎదిగినా ఒదిగి ఉండమని / అనుక్షణం హెచ్చరిస్తూ ..' నాన్న గొప్పతనాన్ని ఈ కవితలో తెలియజేశారు. 'సంద్రం పిలుపు' కవితలో తుపాను సమయంలో గంగపుత్రుల వెతలు కంటికి కట్టినట్లు అలతి పదాలతో దశ్యమానం చేశారు. 'ఆకలి చేసే పేగుల చప్పుళ్ళు/ వాన చప్పుళ్ళతో కలిసిపోతున్నాయి' అని ఆకలి బాధ గురించి చెప్పారు.. 'తడికట్టెలు మొరాయిస్తున్నాయి / పొగ గొట్టంతో కుస్తీ పడుతూ ..' అని ఒక కవితలో చదివినప్పుడు – నా చిన్ననాటి పల్లె జ్ఞాపకాలను గుర్తుకు వచ్చాయి. వాన వచ్చి పదును చేరిన కట్టెలతో అగ్ని రాజేయటం ఎంత కష్టమో పల్లె తల్లులకు తెలుసు. 'గూడు రిక్షా' కవిత కూడా రిక్షావాలా కష్టాలను కళ్లకు కట్టించారు. 'తాను కదలని రోజు/ యజమానికి పూటగడవదని/ కదులుతోన్న కాలపు వేగాన్ని / తానందుకోలేక పోతోందని ..' రిక్షాకు ఆపాదిస్తూ చెప్పారు. 'ప్రతి రూపం' కవితలో అమ్మతో తన అనుబంధాన్ని ఆవిష్కరించారు. అమ్మతనమున ఎంత కమ్మదనం ఉందిరా అమృతానికే ఆమె తీపి నేర్పింది రా అన్నారు ఓ కవి. కన్ను తెరిపించేది, వెన్న తినిపించేది అమ్మే... 'అమ్మ ఉదరం లోనే కాదు/ హృదయంలో కూడా / హత్తుకుపోయిన బంధం నేనే/ అమ్మ వెలిగించిన చిరుదివ్వెను నేనే' అని అమ్మ గురించి చక్కగా చెప్పారు. 'మృగమన్న పదం వాడితే తిరగబడతాయేమో మృగాలు' అంటూ 'మృగాడు', 'వెన్నెలకూన' కవితల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై అక్షరాస్త్రాలు సంధించారు.

'చినుకు తాకిన నేల' కవితలో తల్లి ప్రేమకు నోచుకోని అనాథల వెతల గురించి వివరించారు. 'కాసింత సాయం అందిస్తే / చిగురించిన కొమ్మల్లా పచ్చదనాన్ని రాసుకొని పసిడి మొక్కలవుతారు' అని వారిపై ప్రేమవర్షం కురిపించారు. మనలోని మానవత్వాన్ని తట్టిలేపే ప్రయత్నం చేశారు. 'చిట్టితల్లి' కవితలో భ్రూణ హత్యల గురించి ప్రస్తావిస్తూ.. 'కన్నే తెరవని చిట్టితల్లిని చిదిమేయాలని చూసే వాళ్ళని చిదిమేయకు నా ప్రాణాన్ని అని మొర పెట్టుకుంటున్న బాధను అక్షరీకరించిన విధానం గుండెల్ని పిండేసేదిగా ఉంది. ఈ సంపుటిలోని కవితలన్నీ సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రాసినవే! పఠితుల మనసులను మంత్ర ముగ్ధులను చేస్తాయి.

– కె.వి.ఎన్. మూర్తి,
94908 05404

నర్సుల సేవలపై కవితల పోటీ

ఈ నెల 12 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అమరావతి సాహితీ మిత్రులు కవితల పోటీ నిర్వహిస్తోంది. వైద్య రంగంలో నర్సుల పాత్ర, వారు అందించే సేవలపై 24 లైన్లకు మించకుండా వచన/ పద్య/ గేయ కవితల్ని రాసి వాట్సాప్‌లో టైప్ చేసి 9493686165 ఫోన్ నెంబరుకి పంపవలసిందిగా అమరావతి సాహితి మిత్రులు సాహితి సంస్థ అధ్యక్ష, సమన్వయ కర్తలు డాక్టరు రావి రంగారావు, పింగళి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మే 15వ తేదీ వరకు కవితలు పంపవచ్చు. ఉత్తమ కవితకు వెయ్యి రూపాయల నగదు బహుమతి. మే 21న మూడవ ఆదివారం ఉదయం గుంటూరు బ్రాడీపేటలో జరిగే అమరావతి సాహితీ మిత్రుల సభలో ఫలితాలు ప్రకటిస్తారు. ఉత్తమమైన కవితకు బహుమతి ప్రదానం, కవితల పఠనం కూడా ఉంటుంది.

16న గులాబీల మల్లారెడ్డి నవల ఆవిష్కరణ

గులాబీల మల్లారెడ్డి రచించిన నవల – ప్రేమ పవనాలు – మానవతా సౌరభాలు (క్యాంపస్‌లో సరిగమలు) – ఆవిష్కరణ సభ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు జరుగుతుంది. సభకు సి.ఎస్. రాంబాబు అధ్యక్షత వహిస్తారు. పుస్తకాన్ని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరిస్తారు. మంత్రి శ్రీదేవి, మామిడి హరికృష్ణ, చెన్నయ్య దోరవేటి, ప్రమోద్ ఆవంచ, వేముల ప్రభాకర్ హాజరవుతారు.

ఖమ్మం ఈస్థటిక్స్- 2023 పురస్కారాలకు ఆహ్వానం

'ఖమ్మం ఈస్థటిక్స్' పేరిట ఈ ఏడాది పురస్కారాలు అందజేయనున్నాం. 2023 అవార్డుల కోసం కవితా సంపుటులను, కథలను ఆహ్వానిస్తున్నాం. మూడు ఉత్తమ కథలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందచేస్తాం. ఉత్తమ కవితా సంపుటికి రూ.40 వేల నగదు బహుమతి ఉంటుంది. కవితా సంపుటి 2022 ఏప్రిల్, 2023 మార్చి మధ్య ప్రచురితమై ఉండాలి. కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. పురస్కారం కోసం కవితా సంపుటి నాలుగు ప్రతులను పంపాలి. పోటీకి పంపే కథలు కేవలం ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. కథ ప్రింట్ నాలుగు ప్రతులను పోస్టులో, యూనికోడ్ సాఫ్ట్ కాపీని మెయిల్లో పంపాలి. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. ఆగస్టు 31, 2023లోగా రచనలు పంపాల్సిన చిరునామా : ఖమ్మం ఈస్థటిక్స్ సాహిత్య పురస్కారాలు, హార్వెస్ట్ స్కూలు, 5-7-200/11, పాకబండ, ఖమ్మం – 507003. వాట్సాప్ : 98491 14369.
Khammamaesthetics@gmail.com

21న కాళ్ళకూరి నాటకత్రయం పుస్తకావిష్కరణ

సాహితీస్రవంతి తూ.గో. జిల్లా అధ్యక్షులు డా.జోస్యుల కష్ణబాబు రాసిన 'శ్రీ కాళ్ళకూరి నారాయణ రావు గారి నాటకత్రయ సమాలోచనము' అనే పుస్తకావిష్కరణ ఈనెల 21 ఆదివారం సాయంత్రం 5 గంటలకు పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతుంది. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ఉపాధ్యక్షులు గనారా, ప్రముఖ కవి డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు, డాక్టర్ గజరావు సీతారామస్వామి, సాహితీస్రవంతి పెద్దాపురం కార్యదర్శి శివ, శివకృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొంటారు.

– కొత్త శివ, సాహితీస్రవంతి, పెద్దాపురం

2008 జైపూర్ బాంబు పేలుళ్ల కేసు

- దోషుల విడుదలపై 17న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : 2008 జైపూర్ బాంబు పేలుళ్ల కేసులో మరణశిక్షపడ్డ నలుగురు దోషులను నిర్దోషులుగా ప్రకటిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను ఈ నెల 17న సుప్రీంకోర్టు విచారించనుంది. 2008 మే 31న జైపూర్‌లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వరుస బాంబు పేలుళ్లలో 71 మంది మరణించగా, సుమారు 185 మంది గాయపడ్డారు. ఈ కేసులో నలుగురు నిందితులు మహ్మద్ సైఫ్, మహ్మద్ సల్మాన్, సైపుర్, మహమ్మద్ సర్వర్ అజ్మీలను దోషులుగా పేర్కొంటూ దిగువ కోర్టు 2019 డిసెంబరులో మరణ శిక్ష విధించింది. ఐదో నిందితుడు షాబాజ్ హుస్సేన్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. రాజస్థాన్ హైకోర్టు ఈ ఏడాది మార్చి 29న దిగువ కోర్టు తీర్పును పక్కన పెట్టింది. షాబాజ్‌ను నిర్దోషిగా విడుదల చేయడాన్ని సమర్థించింది. దర్యాప్తు సక్రమంగా జరగలేదని అధికారులపై విమర్శలు చేసింది. అధికారులు సేకరించిన ఆధారాలు, సాక్ష్యాలతో నిందితుల నేరాన్ని రుజువు చేయడం కష్టమని వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా బాధితుల బంధువులు, రాజస్థాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

2020 ఢిల్లీ అల్లర్ల కేసు విచారణలో ఓ దర్యాప్తు అధికారిపై వేటు

న్యూఢిల్లీ : 2020 ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన అల్లర్ల కేసులో ఒక దర్యాప్తు అధికారిని ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. అసంపూర్ణమైన దర్యాప్తు, అనైతిక ప్రవర్తన కారణంగా అధికారిని విచారణ నుంచి కోర్టు తప్పించింది. ఈ విషయాన్ని ఢిల్లీ పోలీస్ కమీషనర్ సంజయ్ ఆరోరాకు తెలిపింది. ఢిల్లీ అల్లర్లపై ఖజూరిఖాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును అదనపు సెషన్స్ జడ్జి పులస్త్య ప్రమాచల విచారించారు. ఈ కేసులో ఎస్ఐ విపిన్ కుమార్ చేసిన దర్యాప్తు సక్రమంగా లేదని, వాస్తవాలను తప్పుగా నివేదించారని జడ్జి అభిప్రాయపడ్డారు. పది ఫిర్యాదులను క్లబ్ చేసి ఈ కేసు విచారణ సాగిస్తున్నా.. బాధితుల వాంగ్మూలాన్ని, సంఘటనలు జరిగిన సమయాన్ని ప్రస్తావించలేదని జడ్జి విమర్శించారు. తదుపరి విచారణను జులై 20కి వాయిదా వేశారు.

డబ్బు ప్రభావం వల్లే ఓడిపోయాను : జగదీష్ షెట్టర్

న్యూఢిల్లీ : గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ ధన బలం ముందు తాను ఓడిపోయినట్లు కాంగ్రెస్ నేత జగదీష్ షెట్టర్ వెల్లడించారు. బిజెపి నేతగా ఉన్న జగదీష్ షెట్టర్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్టానం తనకు సీటు ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి గురై.. ఎన్నికలకు కొద్దిరోజుల ముందే కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కాంగ్రెస్‌లో హుబ్లి-ధర్వాడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ తనకు సీటు ఇచ్చి ఎన్నికల పోటీలో నిలబెట్టింది. ఆ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి మహేష్ తెంగినకై చేతిలో.. 34 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో జగదీష్ షెట్టర్ తన ఓటమికి గల కారణాలపై ఆదివారం మీడియాతో మాట్లాడారు.

బిజెపి ఓటమికి కారణాలెన్నో!

- కర్ణాటక ఎన్నికల ఫలితాలపై విశ్లేషకులు, సామాజికవేత్తలు



న్యూఢిల్లీ : దక్షిణాది రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఒక్క రాష్ట్రాన్ని బిజెపి కోల్పోయింది. కర్ణాటకను ఆధారంగా చేసుకొని దక్షిణాదిన విస్తరిద్దామనుకున్న బిజెపి ఆశలు అడియాశలయ్యాయి. అయితే, రాష్ట్రంలో ఆ పార్టీ ఓటమికి కారణాలెన్నో. బిజెపి తాను తీసుకున్న నిర్ణయాలు, చర్యలే ఓటమికి కారణమని విశ్లేషకులు, సామాజికవేత్తలు, నిపుణులు పేర్కొంటున్నారు.

1. దేశంలోని చాలా రాష్ట్రాలు విపక్షాల పాలనలో ఉన్నాయనేది వాస్తవమే అయినా.. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో నిరంకుశ ధోరణిని మరవకూడదని నిపుణులు, మేధావులు అన్నారు. కర్నాటక విజయం మరింత శ్రేయోదాయకమనీ, రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేసిన విపరీతమైన ఆగ్రహాన్ని ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు.

2. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటి) డిపార్ట్‌మెంట్, ఇతర కేంద్ర ఏజెన్సీల ద్వారా ప్రతిపక్షంతో సంబంధం ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం ఎన్నికల ప్రచారంలో నిరాటంకంగా కొనసాగిందని చెప్పారు. ఈ సంస్థల కీలక పదవులకు ఎంపికైన వ్యక్తులు సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు.

3. ఎన్నికల సంఘం (ఇసి) నరేంద్ర మోడీ, అమిత్ షాల అనేక ప్రకటనలు, చర్యలపై.. కాంగ్రెస్, ఇతరులు చేసిన ఫిర్యాదులను విస్మరించిందని తెలిపారు. ఓటు వేసేటప్పుడు 'జై బజరంగ్‌బలి' అనే మతపరమైన ప్రార్థనను ఉపయోగించాలని మోడీ ఓటర్లను కోరడంపై ఇసి నుంచి ఇప్పటివరకు ఎలాంటి నోటీసూ రాలేదని గుర్తు చేశారు. మోడీ ఓటర్లకు మతపరమైన పిలుపునివ్వడం ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు.

అజ్ఞాత ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సేకరించిన నిధులను బిజెపి మరోసారి పెద్దఎత్తున కుమ్మరించింది. ఈ రకమైన ఎలక్టోరల్ బాండ్ల రాజ్యాంగబద్ధత సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేస్తూనే ఉన్నది. అంటే కర్నాటక ఎన్నికలు కచ్చితంగా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగలేదని అభిప్రాయపడ్డారు.

5. ఎన్నికల కోడ్‌ను విధించే ముందు అధికారిక సందర్శనల కోసం మోడీ రాష్ట్ర వనరులను భారీగా ఖర్చు చేయడంతో కార్పొరేట్ యాజమాన్యంలోని బడా జాతీయ మీడియా బిజెపికి ప్రచార విభాగంగా పని చేసిందని తెలిపారు.

6. కాంగ్రెస్ పార్టీ టెర్రరిస్టులతో కలిసి పనిచేస్తోందని చెప్పడం నుంచి కాంగ్రెస్ గెలిస్తే అల్లర్లు జరుగుతాయని అమిత్ షా చెప్పడం వరకు బిజెపి ప్రచారం, మోడీ ప్రసంగాలు తీవ్ర మతతత్వ, విద్వేషపూరితంగా ఉన్నాయి. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయాలనే నిర్ణయంతో ఎన్నికల ముందు బిజెపి తన ప్రచారాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ చర్యపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇవిఎం బటన్‌ను నొక్కిన తర్వాత 'జై బజరంగ్‌బలి' అని కేకలు వేయాలని ఓటర్లను కోరడం ఒక్కటే కాదు.. హిందువుల ఓటర్లను ఆకట్టుకునేందుకు మోడీ 'కేరళ స్టోరీ' చిత్రాన్ని పాచికగా వాడుకున్నారు.

7. మణిపూర్‌లో 60 మందికి పైగా అధికారికంగా ప్రాణాలు కోల్పోయిన భారీ హింసాకాండను మోడీ,షా పట్టించుకోలేదని చెప్పారు. వారు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున హింసాకాండ కారణంగా 35,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇద్దరు నేతలు కర్ణాటకలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ప్రాముఖ్యతపై పాఠాలు చదువుతుండగా, మణిపూర్‌లో 'లా అండ్ ఆర్డర్'కు ఆటంకం ఏర్పడింది. అదేవిధంగా, ఇదే సమయంలో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడుల కారణంగా భారత సైన్యానికి చెందిన ఐదుగురు స్పెషల్ ఫోర్సెస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అయితే కర్నాటక ప్రచారంలో బిజీగా ఉన్న మోడీ వారి మరణాలను గుర్తించకపోవడం గమనార్హం.

8. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గుజరాత్ కోర్టు తీర్పుతో లోక్‌సభ నుంచి ఉద్వాసనకు గురయ్యారు. రాహుల్ విషయంలో న్యాయస్థానం, లోక్‌సభ సెక్రెటరీ, స్పీకర్ శీఘ్ర నిర్ణయాలు తీసుకోవటం బిజెపికే బెడిసికొట్టింది.

9. ప్రచార సమయంలో అదానీ అవినీతి సమస్యపై మోడీ మౌనం నిరాటంకంగా కొనసాగింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం '40 పర్సంటేజీ సర్కారు' అన్న ప్రతిపక్షాల ప్రచారం జనాల్లో బలంగా నాటుకుపోయింది.

10. ఎన్నికలకు ముందు రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో బిజెపి ప్రభుత్వం అనవసర కేసులు, ఇతర ప్రతీకార చర్యల ద్వారా పౌర సమాజ గొంతులను నొక్కడానికి అన్నివిధాలుగా ప్రయత్నించింది. హిందూత్వాన్ని విమర్శిస్తూ సోషల్ మీడియా పోస్ట్ చేసినందుకు నటుడు చేతన్ కుమార్‌ను అరెస్టు చేసింది. అతని ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఒసిఐ) కార్డును రద్దు చేసింది.

డీజిల్, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఉపసంహరించుకోండి

- రోడ్డు రవాణా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ జాతీయ సదస్సు పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డీజిల్, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని ఉపసంహరించుకోవాలని, 2020 జూన్ 7న ఆయిల్ కంపెనీలు సవరించిన ధరలను వెనక్కి తీసుకోవాలని రోడ్డు రవాణ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ జాతీయ సదస్సు డిమాండ్ చేసింది. ఢిల్లీలోని బిటిఆర్ భవన్‌లో ఆదివారం జరిగిన సదస్సు పలు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచి, వాటిని ఆమోదించాలని కోరింది.

డిమాండ్లు

- రాష్ట్రాలకు వచ్చే ఆదాయ నష్టాన్ని సక్రమంగా భర్తీ చేస్తూ పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి పొందుతున్న వారికి కొత్త వాహనాల కొనుగోలు కోసం జాతీయ బ్యాంకుల ద్వారా రుణం ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.
- ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వేధింపులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.
- బీమా ప్రీమియంలను నియంత్రించాలి. ప్రీమియం రేట్లను నిర్ణయించడంలో పారదర్శకత పాటించాలి.
- అపాయింట్‌మెంట్ లెటర్స్, చట్టాల వర్తింపు కోసం వి.వి.గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ సిఫార్సులను సక్రమంగా అమలు చేస్తూ అసంఘటిత రవాణా కార్మికుల కోసం సామాజిక భద్రతా చట్టాన్ని రూపొందించండి.
- సవరించిన మోటర్ వెహికల్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి. మెరుగైన, సరైన ప్రత్యామ్నాయ విధానం కోసం భాగస్వామ్య పక్షాలతో చర్చించాలి.
- కార్మిక వర్గ లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి
- స్వయం ఉపాధితో సహా అసంఘటిత రోడ్డు రవాణా కార్మికులందరినీ కార్మిక శాఖ రిజిస్టర్లలో నమోదు చేయాలి. అన్ని కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. అందుకనుగుణంగా తగిన సవరణలు చేయాలి.
- పోలీసులు, ఇతర అధికారుల వేధింపులను తక్షణమే ఆపాలి.
- ఉబర్, ఓలా వంటి యాప్ ఆధారిత కంపెనీల్లో పనిచేసే డ్రైవర్లను కార్మికులుగా పరిగణించాలి. అందుకనుగుణంగా మోటర్ వెహికిల్ చట్టం, ఎంటిడబ్ల్యు చట్టంలో సవరణలు చేయాలి.
- కాంట్రాక్టర్ల ద్వారా ఆయిల్ ట్యాంకర్లపై పనిచేసే డ్రైవర్లు, క్లీనర్లకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ మొదలైనవి చెల్లించాలి. ఆయిల్ కంపెనీలు అమలుకు బాధ్యత వహించాలి. కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఈ నిబంధన చేర్చాలి. డ్రైవర్ వృత్తిని గౌరవంగా చూడాలి.
- బడ్జెట్‌ను కేటాయించి, రాష్ట్రాల్లో ఉండే ఆర్‌టిసిలను బలోపేతం చేయాలి. విస్తరించాలి.
- 1:2 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్‌టిసిలకు మూలధన సహకారం పునరుద్ధరించాలి. ఈ ప్రయోజనం కోసం వివిధ దేశాల్లో చేస్తున్న విధంగా నిధులను సమీకరించడానికి తగిన పద్ధతులను అనుసరించాలి.
- దేశంలోని అన్ని ఆర్‌టిసిలకు పేరుకుపోయిన అప్పులను ప్రభుత్వాలు వన్-టైమ్ సెటిల్‌మెంట్‌తో ఈక్విటీగా మార్చాలి.
- లక్ష బస్సులను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసి, వన్ టైమ్ సెటిల్‌మెంట్‌గా దామాషా ప్రాతిపదికన అన్ని ఆర్‌టిసిలకు పంపిణీ చేయాలి.
- ఎక్సైజ్ డ్యూటీ, డీజిల్, ఛాసిస్, స్పేర్స్, ఫ్యాబ్రికేషన్ మొదలైన వాటిపై సేల్స్ టాక్స్ నుండి ఆర్‌టిసిలను మినహాయించాలి.
- ఎఫ్ఎఎంఇ 1, 2 కింద ఎలక్ట్రిక్ బస్సులను ఆర్‌టిసిలకు మాత్రమే కేటాయించాలి. ఆర్‌టిసిలను "లాభం, నష్టం" స్కేల్‌లో కొలవకూడదు.
- ప్రైవేట్ ఆపరేటర్ల అక్రమ కార్యకలాపాలను వెంటనే ఆపాలి. ఎంవి యాక్ట్‌కు అవసరమైన సవరణలు తీసుకురావాలి.
- ఆర్‌టిసి ఉద్యోగులకు ఆర్‌టిసి చట్టం 1950లోని సెక్షన్ 19(1)(సి)లో నిర్దేశించిన విధంగా న్యాయమైన వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్ ఏర్పాటు, నివాసం, విశ్రాంతి కోసం స్థలాలు, వినోదం ఇతర సౌకర్యాలతో సహా తగిన సేవా పరిస్థితులు అందించాలి.
- ఆర్‌టిసి కార్మికులందరూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ పథకానికి అర్హులు కావాలి.
- ఆర్‌టిసి కార్మికులను కూడా కోవిడ్-19 వారియర్స్‌గా పరిగణించాలి. 50 లక్షల బీమా, ఇతర ప్రయోజనాలు ఇవ్వాలి.
- ఆర్‌టిసిలు ఉత్తమ నిర్వహణ పద్ధతులను ఏర్పరచుకున్నందున, వారి సొంత స్క్రాపింగ్ విధానాలను అవలంబించినందున బస్సులను స్క్రాప్ చేయడం తప్పనిసరి చేయకూడదు.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలైన ప్రాంతాల్లో జరుగుతున్న విధంగా అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి గూడ్స్ రవాణాను చేపట్టేందుకు అన్ని ఆర్‌టిసిలకు అనుమతి ఇవ్వాలి.
- అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి ఆర్‌టిసిలకు పెట్రోలు, డీజిల్ అవుట్ లెట్ డీలర్ షిప్‌లను మంజూరు చేయాలి.

ఉదారవాద ప్రజాస్వామ్యంలోనే

భారత అభివృద్ధి మార్గం : రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ : దేశ అభివృద్ధి మార్గం ఉదారవాద ప్రజాస్వామ్యంలో ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. భారత అభివృద్ధి పథం దాని అంతర్గత బలాలను ఉపయోగించుకోవడం, ప్రపంచ సరఫరా గొలుసులకు కీలకమైనదిగా మారడంతో అందరికీ గౌరవమైన చారిత్రాత్మక సంస్కృతిని నిర్మించడం ద్వారా కీలకమైనదిగా మారిందని చెప్పారు. సేవల రంగంలో భారతదేశానికి నాయకత్వ పాత్ర పోషించే అవకాశం ఉన్నదనీ, ఈ ప్రయత్నంలో ప్రపంచం విశ్వాసాన్ని సంపాదించడానికి ఉదారవాద ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం ఆర్థిక అవసరమని నొక్కి చెప్పారు. విశ్వసనీయమైన ప్రపంచ సరఫరాదారుగా మరింత నేరుగా తయారీ లేదా సేవల కాంపోనెంట్‌పై దష్టి పెట్టడం ద్వారా భారతదేశం ప్రయోజనం పొందుతుందని అన్నారు. "మన స్వతంత్ర న్యాయవ్యవస్థ, మన ఉదారవాద ప్రజాస్వామ్యం, మనం ఈ ఉత్పాదక సేవ-నేతత్వంలోని వద్ధి పథంలోకి వెళ్లాలంటే ఇవి క్లిష్టమైన ప్రయోజనాలు. ఎందుకంటే ఇది ప్రపంచం నమ్మకాన్ని సంపాదించడానికి వీలు కల్పిస్తుంది. ఇది అంతర్గతంగా అవసరం" అని 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో రాజన్ తన ప్రధాన ప్రసంగంలో అన్నారు. "మనం భారతీయులుగా ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నాం. కానీ మనం విశ్వసించగలమనీ, ఈ రకమైన సేవలను సమర్థవంతంగా అందించగలమని ప్రపంచాన్ని ఒప్పించేలా ప్రజాస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నాం. మన సంస్థలను బలోపేతం చేయడంలో, మన పటిష్టతలో మనం మన హెూంవర్క్ చేయాలి" అని తెలిపారు.

ఇఐపిఎంఎఫ్ కోసం స్వీడన్‌కు జైశంకర్

- ఉక్రెయిన్ యుద్ధంతో సహా అనేక అంశాలపై ఎనిమిది దేశాల మంత్రులతో చర్చలు

స్టాక్‌హోమ్ : ఇయు ఇండో-పసిఫిక్ మంత్రుల ఫోరమ్ (ఇఐపిఎంఎఫ్)లో పాల్గొనేందుకు భారత విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం స్వీడన్‌కు చేరుకున్నారు. స్వీడన్‌లో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్, ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, సైప్రస్, లాత్వియా, లిథువేనియా, రుమేనియా దేశాలకు చెందిన మంత్రులతో జైశంకర్ సమావేశమయ్యారు. ఇండో-పసిఫిక్, ఉక్రెయిన్ యుద్ధంతో సహా అనేక అంశాలపై ఈ దేశాల మంత్రులతో చర్చలు జరిపారు. ఈ వివరాలను ఆయన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వరుస ట్వీట్లతో ఈ విషయాలను తెలిపారు. ముందుగా బెల్జియం విదేశాంగ మంత్రి హడ్జా లహబీబ్‌తో జైశంకర్ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, బహుపాక్షిక సహకారంపై వీరిరువురూ చర్చించారు. అనంతరం బల్గేరియా విదేశాంగ మంత్రి ఇవాన్ కొండోవ్‌తో చర్చించారు. రుమేనియా విదేశాంగ మంత్రి బోగ్డాన్ ఆరెస్కుతో జైశంకర్ విడిగా చర్చలు జరిపారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయ పౌరుల తరలింపు కోసం నిర్వహించిన ఆపరేషన్ గంగా మిషన్‌ను విజయవంతం చేయడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ, ఇంధన సహకారంపై చర్చించారు. ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి కేథరీన్ కొలొనాతోనూ జరిపిన సమావేశంలో ఇండో-పసిఫిక్, జి20పై పరస్పరం అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు. ఆస్ట్రియా, లాత్వియా విదేశాంగ మంత్రులతో జరిగిన సమావేశాల్లోనూ ఉక్రెయిన్ యుద్ధంపై ప్రధానంగా చర్చించారు. బంగ్లాదేశ్‌లో శుక్రవారం జరిగిన 6వ హిందూ మహా సముద్ర సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు.

అయోధ్యలో ముస్లిం అభ్యర్థి విజయం

- 'పుర' ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..
- రామజన్మభూమి వెనుక భాగంలోని వార్డులో గెలుపు
- మూడో స్థానంలో బిజెపి


లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని నగరపాలక ఎన్నికల్లో ఒక ముస్లిం అభ్యర్థి విజయం సాధించారు. హిందూత్వ ప్రాబల్యం అధికంగా ఉండే అయోధ్యలోని ఒక వార్డులో సదరు అభ్యర్థి గెలిచారు. ఇండిపెండెంట్‌గానే పోటీ చేసి ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. అయోధ్యలో జరిగిన మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. మొత్తం 60 వార్డుల్లో 27 వార్డులను ఆ పార్టీ కైవసం చేసుకున్నది. ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) 17 స్థానాల్లో విజయం సాధించగా.. స్వతంత్రులు 10 స్థానాల్లో గెలిచారు.

ఈ ఎన్నికల్లో సుల్తాన్ అన్సారీ అనే స్థానిక యువకుడు తన ఎన్నికల అరంగేట్రంలోనే గణనీయమైన విజయాన్ని సాధించాడు. రామ్ అభిరామ్ దాస్ వార్డులో గెలిచాడు. "అయోధ్యలో హిందూ-ముస్లిం సోదరభావం, రెండు వర్గాల శాంతియుత సహజీవనానికి ఇది ఉత్తమ ఉదాహరణ. మా హిందూ సోదరుల నుంచి ఎలాంటి పక్షపాతం లేదు. వారు నన్ను వేరే మతానికి చెందిన వ్యక్తిగా భావించలేదు. వారు నా విజయానికి మద్దతు, భరోసాను ఇచ్చారు" అని అన్సారీ చెప్పాడు.

రామజన్మభూమి వెనుక భాగంలో ఉన్న ఈ వార్డులో ముస్లిం ఓట్ల శాతం 11 శాతం మాత్రమే ఉన్నది. మొత్తం ముస్లిం ఓట్లు 440 కాగా.. హిందూ ఓట్లు 3,844 గా ఉన్నాయి. మొత్తం 2,388 ఓట్లు పోలవగా అన్సారీకి 42 శాతం ఓట్లు లభించాయి. మొత్తం 10 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. అన్సారీకి 996 ఓట్లు వచ్చాయి. అన్సారీ.. మరో స్వతంత్ర అభ్యర్థి నాగేంద్ర మాంఝీపై 442 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ బిజెపి మూడో స్థానంలో నిలవడం గమనార్హం. " రామ మందిరానికి అయోధ్య ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ మతపరమైన పట్టణం హిందువులకు ఎంత పవిత్రమైనదో ముస్లింలకు కూడా అంతే పవిత్రమైనది. ఇక్కడ చాలా మసీదులు కనిపిస్తాయి. అనేక శతాబ్దాల నాటి ముస్లిం సూఫీల సమాధులు కూడా ఉన్నాయి" అని అయోధ్యకు చెందిన వ్యాపారవేత్త సౌరబ్‌సింగ్ అన్నారు. అయోధ్యలో ముస్లింలు ఉండగలరు, ఎన్నికల్లోనూ గెలవగలరని వార్డుకు చెందిన అనూప్ కుమార్ తెలిపారు.

ఉపాధి హామీ కూలీల సంక్షేమ నిధి

- కేరళలో వాస్తవ రూపం దాల్చిన పేదల కల


కేరళ సిఎం పినరయి విజయన్

తిరువనంతపురం : దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ఉపాధి హామీ కార్మికుల కోసం ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నారు. సంక్షేమ నిధి ఉపాధి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల భద్రత, సంక్షేమం, పెన్షన్, వివాహ భత్యం మరియు అధ్యయన సహాయంతో సహా నిర్ధారిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మహాత్మా అయ్యంగాలి పట్టణ ఉపాధి హామీ పథకంలో భాగమైన 14 లక్షలకు పైగా కుటుంబాలు సంక్షేమ నిధి ద్వారా లబ్ధి పొందుతాయని భావిస్తున్నారు. సంక్షేమ నిధిని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు పాలక్కాడ్‌లోని కొత్తమైదానిలో అధికారికంగా ప్రారంభించను న్నారు. స్థానిక స్వపరిపాలన ఎక్సైజ్ శాఖ మంత్రి ఎంబి రాజేష్ అధ్యక్షత వహిస్తారు. ప్రభుత్వ ద్వితీయ వార్షికోత్సవానికి సంబంధించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అయ్యంగళి పట్టణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న వారికి సంక్షేమ నిధిలో సభ్యత్వం లభిస్తుంది. నమోదు చేసుకున్న కార్మికుడు నెలవారీగా చెల్లించే రూ.50కి సమానమైన మొత్తాన్ని ప్రభుత్వం సంక్షేమ నిధికి చెల్లిస్తుంది. చెల్లించిన మొత్తాన్ని కార్మికుల పెన్షన్, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తారు. 18 ఏళ్లు నిండి, 55 ఏళ్లు నిండని వారు, సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న సంవత్సరంలో లేదా దానికి ముందు రెండేళ్లలో కనీసం 20 రోజుల పాటు నైపుణ్యం లేని పనిలో నిమగ్నమై ఉన్నవారు సభ్యులు కావచ్చు.

సంక్షేమ నిధిలో భాగంగా లభించే ప్రయోజనాలు.

60 సంవత్సరాలు నిండిన, 60 సంవత్సరాల వయసు వరకు నిరంతరంగా చందాలు చెల్లించిన సభ్యులకు పెన్షన్

10 సంవత్సరాలకు తక్కువ కాకుండా చందా చెల్లించిన సభ్యుని మరణంపై కుటుంబ పెన్షన్.

అనారోగ్యం లేదా ప్రమాదం కారణంగా సభ్యుడు మరణించిన సందర్భంలో ఆర్థిక సహాయం.

వైకల్యం లేదా పనిలో అసమర్థత కారణంగా ఫండ్‌లో సభ్యత్వం రద్దు చేయబడిన సందర్భంలో, సభ్యుడు చెల్లించిన సహకారం సూచించిన వడ్డీతో తిరిగి చెల్లించబడుతుంది.

తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న సభ్యుల చికిత్స కోసం ఆర్థిక సహాయం.

మహిళా సభ్యులు, సభ్యుల కుమార్తెల వివాహం, మహిళా సభ్యుల ప్రసవానికి ఆర్థిక సహాయం.

సభ్యుల పిల్లల విద్యా అవసరాలకు ఆర్థిక సహాయం.

2005లో భారత పార్లమెంటు ఆమోదించిన చట్టం ఆధారంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చింది. మొదట ప్రారంభించిన 200 జిల్లాల్లో పాలక్కాడ్ జిల్లా ఒకటి. దేశంలోనే మొట్టమొదటి ఉపాధి హామీ కార్మికుల సంక్షేమ నిధి బోర్డు ప్రారంభోత్సవం ఈ పాలక్కాడ్‌లో జరగనుంది. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు మరియు పథకం నాణ్యతను నిర్ధారించడానికి పూర్తి సామాజిక తనిఖీని అమలు చేసిన మొదటి రాష్ట్రం కేరళ. నగరాల్లోని అసంఘటిత కార్మికులకు అయ్యంకాళి ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి దేశానికే ఆదర్శంగా నిలిచిన మొదటి రాష్ట్రం కేరళ.


రెజ్లర్ సాక్షి మాలిక్‌తో మాట్లాడుతున్న ఎంపి శివదాసన్, బి.వెంకట్

కొనసాగిన రెజ్లర్ల ఆందోళన

- వ్యవసాయ కార్మిక సంఘాల నేతల సంఘీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 22 రోజులు పూర్తి చేసుకుంది. ధర్నా శిబిరాన్ని ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు ఆందోళన చేస్తున్న క్రీడాకారులకు ఉద్యమ సహాయ నిధిని అందజేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బి.వెంకట్, రాజ్యసభ ఎంపి శివదాసన్, బోలా ప్రసాద్, బిజిలాల్ భారతి, రాధిక మీనన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ ప్రధాని మోడీ అండతోనే బ్రిజ్ భూషణ్ పెట్రేగిపోతున్నారని, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రధాని మోడీ నియంతృత్వాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. రెజ్లర్లు చేస్తున్న పోరాటం దేశ ప్రతిష్టకు, ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన పోరాటమని అన్నారు. దేశానికి గోల్డ్ మెడల్ తీసుకొచ్చిన రెజ్లర్లను రోడ్డు ఎక్కేటట్లు చేసినబ్రిజ్ భూషణ్ తక్షణమే పదవి నుండి తొలగించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులు లైంగిక వేధింపులకు గురికావడంతో అంతర్జాతీయ సమాజం దృష్టిలో దేశ ప్రతిష్ట దిగజారిందని అన్నారు. క్రీడాకారులకు సంఘీభావంగా ఈనెల 18న దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని తెలిపారు.

బిజెపికి చెందిన మహిళా ఎంపీలకు లేఖలు రాస్తాం : వినేష్ ఫోగాట్

"మహిళల గౌరవం కోసం మేము చేస్తున్న పోరాటంలో మద్దతునిచ్చేందుకు" ఒక్క అధికార పార్టీ మహిళా ఎంపీ కూడా ముందుకురాలేదని రెజ్లర్ వినేష్ ఫోగాట్ విమర్శించారు. 'దేశంలోని మహిళల భద్రత గురించి మాట్లాడేటప్పుడు... మేము కూడా వారి కుమార్తెలమే, వారు బయటకు వచ్చి మాకు మద్దతు ఇవ్వాలి' అని ఆమె అన్నారు. "మేము వారికి (అధికార పార్టీ మహిళా పార్లమెంటేరియన్లు) బహిరంగ లేఖ వ్రాస్తున్నాము. మా తోటి రెజ్లర్లు ఆ లేఖలను చేతితో అందజేస్తారు. మేము ఇ-మెయిల్ ద్వారా కూడా లేఖలు పంపుతాము. మా వాయిస్, మా మనోవేదనలు ఇంకా వారికి చేరలేదని భావిస్తున్నాం. వారు లేఖలు అందుకున్న తర్వాత వచ్చి మద్దతు ఇస్తారని మేము భావిస్తున్నాం" అని వినేష్ పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనలో భాగస్వామ్యం అవుతున్న ప్రజలు ఈ నెల 16న తమ జిల్లా కేంద్రాలకు వెళ్లి, రెజ్లర్లకు మద్దతుగా మెమొరాండాలు ఇవ్వాలని కోరారు. "మహిళల గౌరవం కోసం కేవలం ఒక్కరోజు సత్యాగ్రహ ఆందోళన (అహింసాత్మక ప్రతిఘటన) చేయాలని మాకు మద్దతు ఇస్తున్న వారిని అభ్యర్థిస్తున్నాం" అని వినేష్ అన్నారు.



కాషాయ మీడియా కల్పిత కథనాలు

న్యూఢిల్లీ : బిజెపికి, కార్పొరేట్ సంస్థలకు వంత పాడుతూ నిత్యం తప్పుడు కథనాలు వండి వార్చే కొన్ని మీడియా సంస్థలు కర్ణాటక ఎన్నికల ఫలితాల రోజు కూడా ప్రజలను మభ్యపెట్టేందుకు విఫలయత్నం చేశాయి. బిజెపి ఘోర పరాజయం పాలైన ఈ ఎన్నికల్లో 100కు పైగా స్థానాల్లో దూసుకుపోతోందంటూ తప్పుడు నంబర్లతో కాషాయ మీడియా ఊదరగొట్టింది. బిజెపి అనుకూల మీడియా తప్పుడు ప్రసారాలతో ప్రజలను ఏ విధంగా మభ్యపెడుతోందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ సిపిఎం ఆదివారం నాడు విమర్శించింది. ఈ మేరకు సిపిఎం అధికారిక ఫేస్‌బుక్ పేజీలో ఒక పోస్టు చేసింది. బిజెపి దూసుకెళ్తోందంటూ తప్పుడు కథనాలను ప్రసారం చేసిన ఒక ఛానెల్ వీడియోను కూడా జత చేసింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు బిజెపికి అనుకూలంగా ఉండే మీడియా సంస్థలు ఎంత సిగ్గుమాలిన కథనాలు వండివారుస్తాయో చెప్పడానికి ఇదే నిదర్శనమని సిపిఎం విమర్శించింది.

సోషల్‌మీడియా పోస్టుతో గొడవలు

- ఒకరు మృతి, ఎనిమిది మందికి గాయాలు

అకోలా : మహారాష్ట్రలోని అకోలా నగరంలో సోషల్ మీడియాలో మతపరమైన పోస్టు వైరల్ అవ్వడం వల్ల హిందూ, ముస్లిముల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల వల్ల ఒకరు మరణించారు. ఇద్దరు పోలీసులతో సహా ఎనిమిదిమందికి గాయాలయ్యాయని అధికారులు ఆదివారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. శనివారం అర్ధరాత్రి 11.30 మహారాష్ట్రలోని ఓల్డ్ సిటీలో సోషల్ మీడియాలో మతపరమైన పోస్టు వైరల్ అవడంతో, హిందూ, ముస్లిముల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఈ ఘర్షణలకు కారణమైన 26 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘర్షణల వల్ల నగరంలో శాంతిభద్రతల దృష్ట్యా ఆ జిల్లా మెజిస్ట్రేట్ నీమా అరోరా 144 సెక్షన్‌ను విధించారు. సోషల్‌మీడియాలో మతపరమైన పోస్ట్ వైరల్ అవ్వడం వల్లే ఈ హింస జరిగిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సందీప్ ఘూగే తెలిపారు. ఈ ఘటనలో ఇరు గ్రూపుల సభ్యులు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారని, కొన్ని వాహనాలను కూడా ధ్వంసం చేశారని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మోనికా రౌత్ తెలిపారు. ఇక ఈ ఘటనలో 'ఒక వ్యక్తి మరణించాడు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఇద్దరు పోలీసులపై రాళ్లు రువ్వడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు' అని ఘూగే చెప్పారు. ఈ అల్లరి మూకలను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారని, ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని రౌత్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన 26 మందిని అదుపులోకి తీసుకుని, వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి ఘూగే తెలిపారు.

అధిష్టానానికే అప్పగింత

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 24తో ముగియనున్నందున కర్ణాటకలో కొత్తగా ఎన్నికైన అసెంబ్లీని అంతకుముందే ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్టీ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్ సిఎం పదవి కోసం పోటీపడుతున్నారు.

సిద్ధరామయ్య, శివకుమార్‌లకు మద్దతుగా పోస్టర్లు

సిద్ధరామయ్య మద్దతుదారులు బెంగళూరులోని ఆయన ఇంటి వెలుపల "కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి" అని పేర్కొంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. "కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి"కి "పుట్టినరోజు శుభాకాంక్షలు" తెలుపుతూ శివకుమార్ నివాసం వద్ద పోస్టర్లు వెలిశాయి. సోమవారం ఆయన పుట్టినరోజు. 224 మంది సభ్యుల సభలో కాంగ్రెస్ 135 సీట్లను కైవసం చేసుకుంది. ఇద్దరు ఇండిపెండెంట్లు కూడా ఆ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. హర్పన్‌హల్లి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన లత మల్లికార్జున్ కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. జనతాదళ్ (సెక్యులర్) 19 స్థానాలను గెలిచిన సంగతి తెలిసిందే. 2018 రాష్ట్ర ఎన్నికలలో 104 స్థానాలు పొందిన బిజెపి తాజా ఎన్నికల్లో 66 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టి) కేటగిరీకి రిజర్వ్ చేసిన ఒక్క సీటు కూడా గెలవలేదు. కర్ణాటకలో 51 రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉన్నాయి, వాటిలో 36 షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) అభ్యర్థులకు, 15 ఎస్‌టి అభ్యర్థులకు ఉన్నాయి. 36 ఎస్‌సి రిజర్వుడు స్థానాల్లో 24 చోట్ల బిజెపి ఓటమి పాలైంది. కాంగ్రెస్ 21 స్థానాల్లో, బిజెపి 12, జెడిఎస్ 3 స్థానాల్లో గెలిచాయి. ఫలితాల అనంతరం శివకుమార్ మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని, అందరినీ తన వెంట తీసుకెళ్లానని, తన కోసం ఎప్పుడూ ఏమీ కోరలేదని చెప్పారు.





రైతు కొడుకు

అనగనగా ఒక ఊరిలో ఒక రైతు కుటుంబం ఉండేది. వాళ్లది చాలా పేద కుటుంబం. పంటలు పండక చాలా కష్టాలు పడేవారు. ఒక పూట తిని రెండో పూట పస్తులుండేవారు. వాళ్లకి ఒక కొడుకు ఉన్నాడు. కొడుకును చాలా ప్రేమగా పెంచేవారు. అతన్ని బాగా చదివించాలన్నది రైతు కల. తండ్రి కలను నెరవేర్చేలా కొడుకు బాగా చదివి ఉద్యోగం సంపాదించుకున్నాడు. అయితే ఉద్యోగం వచ్చాక ఇంటికి వచ్చిన కొడుక్కి అక్కడి పరిస్థితుల్లో ఏమీ మార్పు కనబడలేదు. తన చిన్నప్పుడు తమ కుటుంబం పడిన బాధలు, కష్టాలు ఇప్పటికీ అక్కడ చాలా కుటుంబాలు అనుభవిస్తున్నాయి. ఇవన్నీ చూసిన రైతు కొడుకు ఎక్కడో పట్టణంలో ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించడం కంటే ఇక్కడే ఊళ్ళోనే ఏదైనా ఊరు బాగుపడే పని చేయాలనుకున్నాడు. వ్యవసాయ పనిముట్ల దుకాణం పెట్టాడు. గతంలో ఎప్పుడూ ఆ ఊరివాళ్లు ఆ వస్తువులు వాడలేదు. దీంతో స్వయంగా వాటిని ఎలా ఉపయోగించాలో నేర్పాడు. డబ్బులు లేని వాళ్లకు ఉచితంగా ఇచ్చాడు. రైతు కొడుకు చేసిన సాయం వల్ల, పనిముట్ల వాడకం వల్ల ఆ యేడు పంటలు బాగా పండాయి. అందరి కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి. చిన్నవాడైనా ఊరి బాగుకోసం రైతు కొడుకు పడిన తాపత్రయం ఊరందరినీ సంతోషపరిచింది. శాస్త్ర, సాంకేతికతంగా ఎలా ముందుకెళ్లాల్లో నేర్పించిన అతని తెలివితేటలను ఊరివాళ్లు ప్రశంసించారు.



- ఎన్. శ్రీసాయి పవన్, 6వ తరగతి, పానుకుమాడు, ఏలూరు జిల్లా.

ఫ్యాషన్

హాయ్ ఫ్రెండ్స్, నా పేరు జస్మిక.. అమ్మ నన్ను చిన్నితల్లి అని పిలుస్తుంది. ఈ డ్రెస్సులన్నీ అమ్మ కుట్టినవే.. ఈ బట్టలు నాకు వేసేసి ఎంత మురిసిపోతుందో.. మీరూ చూడండి.. ఈ బట్టల్లో నేను ఎలా ఉన్నాను..

- ఎం.జస్మిక, ఎల్‌కేజీ, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, విస్సన్నపేట.









విమానాశ్రయం కట్టేశాం..



హాయ్ ఫ్రెండ్స్,

మేము ముగ్గురం ఫ్రెండ్స్. చెంచుకాలనీలో ఉంటాం. మా కాలనీ పక్కనే విమానాశ్రయం ఉంది. రోజూ విమానాలు రావడం, వెళ్లడం చూస్తాం. భలే సరదాగా ఉంటుంది. ఇప్పుడు సెలవులొచ్చేశాయి కదా.. మా కాలనీలో నడుపుతున్న ఆదర్శ ట్యూషన్ సెంటరుకు వెళుతున్నాం. అక్కడ మాకు ఒక టాస్క్ ఇచ్చారు. అట్టముక్కలతో మాకు నచ్చిన ఆటబొమ్మలు తయారు చేయమన్నారు. అంతే.. ఇక ఆలస్యం చేయకుండా మాకు ఎంతో ఇష్టమైన విమానాశ్రయాన్ని కట్టేశాం.

మా ఫ్రెండ్స్ మొన్న పండగకి చెప్పులు కొనుక్కున్నప్పుడు వచ్చిన అట్టపెట్టెలను తీసుకొచ్చారు. ఓ కత్తెర సాయంతో వాటిని అందంగా కత్తిరించాం. గమ్ సాయంతో అతికించాం. విమానాశ్రయంలో ఉండే భవనాలు, స్తంభాలు తయారుచేశాం. కొన్ని తెల్ల కాగితాలు తీసుకుని విమానాశ్రయం ఫ్లోర్ కనిపించేలా చేశాం. విమానం కూడా తయారుచేశాం. స్కెచ్ తీసుకుని రంగులు వేశాం. మేం తయారుచేసిన విమానాశ్రయం చూసి మా టీచర్ బాగా మెచ్చుకున్నారు. కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో చేసే విమానాశ్రయాన్ని అట్టముక్కలతో చాలా సులభంగా కట్టేశామని నవ్వారు కూడా..



- స్వాయ్, దేవిక, కార్తీక్, చెంచుకాలనీ, గన్నవరం.

బొమ్మరిల్లు




- వై.గిరితిక, 4 వ తరగతి, పెన్నలపాడు, తొట్టంబేడు మండలం, తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ కోసం

మురికిగా ఉన్న బట్టలు వాషింగ్‌మిషన్‌లో వేసేటప్పుడు అల్యూమినియం ఫాయిల్‌తో రెండు లేదా మూడు బాల్స్ చేసి వేయాలి. అప్పుడు బట్టల మురికి బాగా వదులుతుంది.



జీవన సౌరభం

పరిస్థితులు ఎంత దారుణంగానైనా ఉండని అవకాశాలు సృష్టించుకోవాలి.





కీచకులకు బుద్ధి చెప్పాలి..

మహిళలు ఎన్ని రంగాల్లో ఎంతగా రాణిస్తున్నా... ఇంకా అణచివేత కొనసాగుతూనే ఉంది. ప్రతి విషయంలోనూ ఆంక్షలు యథేచ్ఛగా నడుస్తూనే ఉన్నాయి. ఇలాంటప్పడే ఇప్పడు గ్రామదేవతలుగా వెలుగొందుతున్న ఒకనాటి వీరనారుల స్ఫూర్తి సమాజంలో రగలాలి. అన్యాయాన్ని అన్యాయమని చాటి, దుష్ట శక్తులకు తగిన బుద్ధి చెప్పే సామూహిక చేతన ముందుకు రావాలి. తిరుపతిలో ఇప్పడు జరుగుతున్న గంగమ్మ జాతర నేపథ్యం ... స్త్రీ శక్తిని చాటే ఒక చారిత్రక సందర్భం.

చిత్తూరు జిల్లాలో ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించుకునే 'గంగమ్మ' జాతరలో కొలువై ఉన్న 'గంగమ్మ'ను అక్కడి ప్రజలు ఆదిశక్తిగా పూజిస్తారు. ఒకప్పుడు తిరుపతి పరిసర ప్రాంతాలకు సామంతుడైన 'పాలెగాడు' పరిపాలించేవాడు. అతడు పరమ దుర్మార్గుడు.. ప్రజలను రాచిరంపాన పెట్టే రాక్షసుడు. మహిళల మానప్రాణాలను తీసేవాడు. వాణ్ణి వధించి కాపాడమని జనం ప్రార్థిస్తే, అప్పుడు గంగమ్మ తల్లి ప్రజల కల్పవల్లిగా వానిని తుద ముట్టించాలని నిర్ణయించింది. ఈ విషయం పాలెగాడికి తెలిసి, ఆ తల్లి కోపానికి జడిసి ఎక్కడికో వెళ్ళి దాక్కున్నాడు. తనను వాడు కనిపెట్టకుండా రోజుకో వేషం వేసి ఊరూరు తిరిగింది. చివరికి గంగమ్మ దొర వేషం వేసినప్పుడు పాలెగాడు తన రాజు వచ్చాడని భావించి బయటికి వస్తాడు. అప్పుడు వాడిని గంగమ్మ వధిస్తుంది. ఇది ప్రచారంలో ఉన్న కథ. అప్పటి నుంచి పాలెగాడి నుండి కాపాడిన గంగమ్మ తల్లికి గౌరవ సూచకంగా జాతరలో భక్తులు రకరకాల వేషాలు వేస్తుంటారు. బైరాగి వేషం, గారడి వేషం, రౌడీ వేషం, బండ వేషం, ఆడ వేషం ... ఇలా వేస్తూ జాతరను జరుపుకోవడం ఆనవాయితీ.

ఇప్పటికీ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర అంటే ఎంతో ప్రత్యేకత. ప్రస్తుతం ఈ జాతర రాష్ట్రస్థాయి పండుగయింది.. వెంకటేశ్వరస్వామికి చెల్లిగా ఏటా సారె అందుకుంటున్న గంగమ్మ, ఈ ఏడాది ప్రతి ఇంటి నుంచి సారె అందుకునేందుకు సిద్ధమైంది. మొక్కులు తీర్చుకునేందుకు తిరుపతి ప్రజానీకం 'గంగమ్మ' వేషాలు వేసేందుకు సిద్ధమయ్యారు. చాటింపు ప్రక్రియతో ప్రారంభమైన ఈ జాతరలో ఈ ఏడాది ఆలయాన్ని పునర్నిర్మించి మహాకుంభాభిషేకం చేయడం ఓ విశిష్టత. మే 9 నుంచి 16 వ తేదీ వరకూ పెద్ద ఎత్తున గంగమ్మ జాతర జరగనుంది.

ఇదీ, వర్తమానం

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గళమెత్తిన రెజ్లర్లకు న్యాయం చేయకపోగా వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు ఇంతవరకు కేంద్రం నుంచి ఎటువంటి స్పందనా రాలేదు. అత్యాచార దోషులకు బిజెపి మద్దతు ఇది మొదటిసారి కాదు. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార ఘటనలో బిజెపి ఎంఎల్‌ఎకు సపోర్టు చేసిందీ ప్రభుత్వం. కథువా రేప్ కేసు సంఘటనలోనూ దోషులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించింది. హత్రాస్ అత్యాచార ఘటనలో సాక్ష్యాలు దొరకకుండా చేసి రేపిస్టులను కాపాడింది. గోద్రా సంఘటనలో రేపిస్టు, హంతకులను విడుదల చేసి సత్కరించింది. ఈ పైత్యం పోకడలు ఇంకా ఎన్నో ఉన్నాయి. తమిళనటుడు, దర్శకుడు భాగ్యరాజ్ 'మహిళల వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. గతంలో.. కట్టుబాట్లు ఉన్న కాలంలో అత్యాచారాలు జరిగేవి కాదని చెప్పుకొచ్చారు.





పితృస్వామ్య భావజాలం నరనరాన ఒంటబట్టించుకున్న సమాజంలో సాటి మహిళల్లో కొందరు అత్యాచార బాధితులకు అండగా నిలవకుండా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. 50 ఏళ్ల మహిళపై అత్యాచారం జరిగితే 'ఇంట్లో నుంచి వెళ్లకపోతే బాగుండేది' అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు వ్యాఖ్యలు చేశారు. రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా నిలవాల్సిన క్రీడాకారిణి పిటి ఉష కూడా వారిపై ఇలాగే అనుచిత వ్యాఖ్యలు చేశారు. రేప్‌లు చేయడం మన వేదాల్లోనే ఉందని, దాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని బిజెపికి చెందిన మహిళలే వ్యాఖ్యలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నపుడే పెళ్లిళ్లను నిశ్చయించాలని, అలాంటి బంధాలే దీర్ఘకాలం ఉంటాయని, వివాహానికి 18 ఏళ్ల వయసును చట్టబద్ధం చేయడం ఓ వ్యాధి లాంటిదని, 18 ఏళ్లు రాగానే యువతులు పారిపోతున్నారని బిజెపి ఎంఎల్ఏ ఒకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లవ్‌జీహాద్ లాంటి ఘటనలను నియంత్రించడానికి బాల్య వివాహాలను ప్రోత్సహించాలనీ పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల్లో అత్యాచారం చేసిన నిందితుడు ఏ మూల దాగున్నా వెతికి మరీ నరికి చంపిన 'గంగమ్మ' మళ్లీ వస్తే బాగుండనిపిస్తోంది. ఈ పండుగ వాతావరణంలో ఆనాడు పాలెగాడిని వధించిన 'గంగమ్మ' తల్లి స్ఫూర్తి మరోసారి ప్రజల ముందుకు వచ్చి 'కీచకుల'కు బుద్ధి చెప్పాలన్న కోరిక బలంగా కలుగుతోంది.

- అవనిగడ్డ వనజ, తిరుపతి

గుడ్డి నమ్మకాలు వదలాలి

కళారంగం.. రాతైనా.. పాటైనా.. ఏదేని ప్రదర్శనైనా.. సమాజాన్ని కదిలించేదిగా.. ఆలోచింపజేసేదిగా సాగాలి. సమాజాన్ని ప్రతిబింబిస్తూ.. చైతన్యపర్చాలి. వినోదాన్ని పంచుతూనే సమాజంలో జరుగుతున్న న్యాయ-అన్యాయాలను, మంచి-చెడులను పారదర్శకంగా చూపించాలి. మూఢత్వాలను పారదోలడంలో కీలక భూమిక పోషించాలి. అలా ఎన్నో కళారూపాలు సమాజాన్ని గొప్పగా ప్రేరేపించిన సందర్భాలు అనేకం.. అయితే ప్రస్తుతం ఎన్నో కళలు, కళారూపాలు కనుమరుగైనా చిత్రరంగం మాత్రం తన ఉనికిని చాటుతూ ముందుకెళుతోంది. హిట్, ఫ్లాప్‌లు.. లాభనష్టాల మాట అటుంచితే సమాజాన్ని ప్రేరేపించే బృహత్తర బాధ్యత సినిమా రంగంపై ఉందనేది కాదనలేని సత్యం. మరి ఇప్పుడు వస్తున్న సినిమాలు సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయి? ముందుకు తీసుకెళ్తున్నాయా.. మూఢత్వంలోకి నెడుతున్నాయా..?





సీనియర్లు తలో దారి..

చిత్రరంగంలో మూలస్తంభాలుగా చెప్పుకునే చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ ఈ మధ్య వరుసగా చేస్తున్న సినిమాలు ఒకసారి చూస్తే.. చిరంజీవి రీమేక్‌లతో దూసుకుపోతున్నారు. కథలో బలం ఉన్నా లేకపోయినా స్టార్‌డమ్ ప్రధాన కేంద్రంగానే ఆయన సినిమాలు వస్తున్నాయి. 'ఖైదీ నెంబర్–150'తో మొదలైన చిరంజీవి సెకండ్ ఇన్నింగ్స్ సినిమాలు ఆ తరహాలోనే ఉంటున్నాయి. ఒకప్పుడు ఆయన నటించిన అనేక చిత్రాలు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వేలెత్తి చూపేవి. ఇక బాలకృష్ణ ఈమధ్య చేస్తున్న సినిమాల్లో నరుక్కోవడం, మితిమీరిన హింస, చెవులు దద్దరిల్లే అరుపులు, కేకలే ఉంటున్నాయి. నాగార్జున, వెంకటేష్ ఎంచుకుంటున్న సబ్జెక్టుల్లోనైతే పాటలు, ఫైట్లు, డబల్‌మీనింగ్ డైలాగులే ఎక్కువగా ఉంటున్నాయి.





కుర్రహీరోలందరిదీ ఒకటే దారి..

సీనియర్ నటీనటులను స్ఫూర్తిగా తీసుకుని ఎంతోమంది యువనటులు సినిమారంగం వైపు ఆకర్షితులయ్యారు. సినిమా కుటుంబాలు, బయట నుంచి వచ్చిన వారితో చిత్రరంగం కుర్రహీరోలతో నిండిపోయింది. అయితే ఒకరు ఏ జోనర్‌లో హిట్ కొడతారో.. ఆ జోనర్‌నే మిగిలిన హీరోలు ఫాలో అవుతున్నారు. 'హ్యాపీడేస్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన నిఖిల్ 'కార్తికేయ' సినిమాతో ఊహించని విజయం సొంతం చేసుకున్నారు. ఫాంటసీ కథాంశంతో తెరకెక్కిన ఆ చిత్రంలో మూఢ నమ్మకాలకు సైన్సును లింక్‌చేయడం చూపించారు. శాస్త్రీయతను నమ్మే హీరో మూఢ నమ్మకాలను ఛేదించడం వరకు బాగానే ఉన్నా సినిమా ఆద్యంతం నమ్మకాల చుట్టూనే సాగుతుంది. ఆ సినిమా విజయం ఇచ్చిన ప్రోత్సాహం నిఖిల్ నుండి 'కార్తికేయ–2' వచ్చేలా చేసింది. ఈ చిత్రంలోనైతే దేవుడు.. కర్మ, కర్మఫలం వంటి నమ్మకాలు చూపించారు. ఎక్కడో ఏ మూలో జరిగిన ఏదేని సంఘటన ముందుగానే నిర్ణయించబడుతుందన్న నమ్మకాన్ని మరింత బలంగా సినిమాలో చొప్పించారు.

ఇటీవల వచ్చిన సాయి ధరమ్ తేజ్ 'విరూపాక్ష' చిత్రం మరో అడుగు వెనక్కు వేసి మంత్రాలకు చింతకాయలు రాలతాయి అన్న మూఢత్వాన్ని ప్రతిబింబించింది. దెయ్యాలు, భూతాలు, చేతబడులు, బాణామతి వంటి మూఢనమ్మకాలు సమాజంలో ఒక వర్గం ప్రజలను ఎప్పుడూ ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఈ సినిమా ఆ నమ్మకాలను మరింత బలపరిచింది. ఇది సమాజాన్ని చైతన్యపర్చడం కాదు.. మరింత అగాథంలోకి నెట్టేయడమే..

ఈ జాబితాలో ఒకప్పటి బాల నటుడు తేజ్ సజ్జా కూడా ఉన్నారు. తేజ్ తాజాగా నటిస్తున్న 'హనుమాన్' చిత్రంలో అతీతశక్తి వల్ల అమిత బలపరాక్రమాలు పొందిన ఓ యువకుని సాహసకార్యాలే ఇతివృత్తంగా ఈ కథ సాగుతుందని ఒక సమావేశంలో స్వయంగా తేజ్ ప్రకటించారు. ఇక సందీప్ కిషన్ నుంచి వస్తున్న కొత్త ప్రాజెక్టు 'ఊరు పేరు భైరవకోన' చిత్రంలో కూడా మాయలు, మంత్రాలు ఉన్నట్లుగా తాజాగా విడుదల చేసిన టీజర్ చూస్తే అర్థమౌతోంది.

ఆయా నటీనటులకు ఎందరో అభిమానులు ఉంటారు. వారంతా తమ హీరోలు వేసిన డ్యాన్సులు, పాడిన పాటలు, చెప్పిన డైలాగులే కాదు సినిమాలో వారు ఆచరించిన విధానాన్ని కూడా గుడ్డిగా అనుసరించడం చాలా సందర్భాల్లో చూస్తున్నాం. మరి ఇప్పుడు వస్తున్న సినిమాల్లో హీరోలు నమ్మకాలను, మాయలను నమ్ముకుంటే పరిస్థితి ఎక్కడికి దారితీస్తుంది? ఈ అంధత్వ ధోరణి సమాజానికి మంచిది కాదు.. సినిమా రంగం సమాజాన్ని నడిపించదు.. కానీ, ప్రభావితం చేస్తుంది. సదరు దర్శక, నిర్మాతలు, హీరోలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే చాలు.. !

రాజస్థాన్ ఢమాల్

- 59కే కుప్పకూలిన రాయల్స్
- సిరాజ్, వేనీ పార్నెల్ విజృంభణ
- 112 పరుగుల తేడాతో బెంగళూర్ గెలుపు



జైపూర్ : రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ భారీ విజయం నమోదు చేసింది. బౌలర్లు మహ్మద్ సిరాజ్ (1/10), వేనీ పార్నెల్ (3/10), మైకల్ బ్రాస్‌వెల్ (2/16), కరణ్ శర్మ (2/19) వికెట్ల వేటలో మ్యాజిక్ చేశారు. 172 పరుగుల ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 10.3 ఓవర్లలోనే కుప్పకూలింది. షిమ్రోన్ హెట్‌మయర్ (35, 19 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాజస్థాన్ రాయల్స్‌కు 50 ప్లస్ స్కోరు అందించాడు. ఐదుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే నిష్క్రమించగా రాజస్థాన్ రాయల్స్ 59 పరుగులకే చేతులెత్తేసింది. 112 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఘన విజయం సాధించింది. అంతకముందు, తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (55, 44 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), గ్లెన్ మాక్స్‌వెల్ (54, 33 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. చివర్లో అనుజ్ రావత్ (29 నాటౌట్, 11 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడగొట్టిన వేనీ పార్నెల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు.

పార్నెల్, సిరాజ్ నిప్పులు : రాజస్థాన్ లక్ష్యం 172 పరుగులు. ఆ జట్టు ఆడిన గత మ్యాచ్‌లో ఛేదనను 13.1 ఓవర్లలోనే ఊదేసింది. దీంతో సహజంగానే రాయల్స్ ఫేవరేట్‌గా కనిపించింది. కానీ పవర్‌ప్లేలో మహ్మద్ సిరాజ్, వేనీ పార్నెల్ అద్వితీయ బౌలింగ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. వికెట్ల పతనంతో సంబంధం లేకుండా పవర్‌ప్లేలో ఎదురుదాడి చేసే రాయల్స్ ప్రణాళిక ఇక్కడ బెంగళూర్‌కు కలిసొచ్చింది. భీకర ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ (0)ను సిరాజ్ సాగనంపగా.. వేనీ పార్నెల్ తన ఓవర్లో జోశ్ బట్లర్ (0), సంజు శాంసన్ (4) కథ ముగించాడు. దేవదత్ పడిక్కల్ (4)ను బ్రాస్‌వెల్ అవుట్ చేయగా.. ఆరో ఓవర్లో జో రూట్ (10)ను వేనీ పార్నెల్ బలిగొన్నాడు. దీంతో పవర్‌ప్లేలో రాజస్థాన్ రాయల్స్ 28 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జైస్వాల్, బట్లర్, శాంసన్ వికెట్లతో ఛేదనలో చతికిల పడిన రాజస్థాన్.. ఆ తర్వాత మిడిల్ ఆర్డర్ పతనంతో కోలుకోలేదు. లోయర్ ఆర్డర్ కథను స్పిన్నర్ కరణ్ శర్మ ముగించాడు. దీంతో 10.3 ఓవర్లలో 59 పరుగులకే రాజస్థాన్ కుప్పకూలింది. షిమ్రోన్ హెట్‌మయర్ (35) ఒక్కడే బెంగళూర్ బౌలర్లపై పైచేయి సాధించాడు. నాలుగు సిక్సర్లు, ఓ ఫోర్ బాదిన హెట్‌మయర్ రాయల్స్‌కు 50 ప్లస్ స్కోరు అందించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది మూడో అత్యల్ప స్కోరు కావటం గమనార్హం. రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో ఇద్దరు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు సాధించారు. ఐదుగురు డకౌట్‌గా వికెట్ కోల్పోయారు. 13 మ్యాచుల్లో రాజస్థాన్ రాయల్స్‌కు ఇది ఏడో పరాజయం. 12 పాయింట్లతో ఆ జట్టు ప్రస్తుతం ఆరో స్థానానికి పడిపోయింది. చివరి మ్యాచ్‌లో నెగ్గినా.. ఇతర మ్యాచుల ఫలితాలపై రాయల్స్ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

రాజస్థాన్ రాయల్స్ ధమాల్. మూడు రోజుల క్రితం 150 పరుగుల లక్ష్యాన్ని 13.1 ఓవర్లలో ఊదేసిన రాజస్థాన్ రాయల్స్.. తాజాగా 171 పరుగుల ఛేదనలో 10.3 ఓవర్లలోనే కుప్పకూలింది. టాప్ ఆర్డర్ వైఫల్యంతో మూడు రోజుల్లోనే భిన్నమైన ప్రదర్శనతో పరాజయం చవిచూసిన రాజస్థాన్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. బౌలర్ల విజృంభణతో 112 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.



ఉత్సాహంగా సాగిన సైక్లోథాన్

హైదరాబాద్ : అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైక్లోథాన్ ఉత్సాహంగా సాగింది. మహిళల ఫిట్‌నెస్, ఆరోగ్యం, శ్రేయస్సులపై అవగాహన కల్పించటంలో భాగంగా భారత్‌లో ఆపిల్ ఉపకరణాల సంస్థ ఆప్ట్రోటిక్స్ 10 కిమి సైక్లోథాన్‌ను నిర్వహించింది. ఆదివారం ఉదయం గచ్చిబౌలిలో జరిగిన సైక్లోథాన్‌లో సుమారు 800 మంది వరకు క్రీడాస్ఫూర్తి వాతావరణంలో పోటీపడ్డారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఛైర్మెన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, మాదాపూర్ డిఎస్పీ శిల్పవల్లి జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్ట్రోనిక్స్ సీఈవో మేఘన సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిఎం కప్ టోర్నీ

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా సంబురాలకు రంగం సిద్ధం. సిఎం కప్ 2023 టోర్నీలో తొలి అంచె పోటీలు నేడు మండల స్థాయిలో ఆరంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 612 మండల కేంద్రాల్లో సిఎం కప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రాల్లో పోటీల నిర్వహణకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసింది. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు నేడు మండల స్థాయిలో సిఎం కప్ పోటీలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఛైర్మెన్ డాక్టర్ ఈడిగ ఆంజనేయ గౌడ్‌లు సైతం నేడు ఎంపిక చేసిన మండల కేంద్రాల్లో సిఎం కప్ పోటీలకు హాజరు కానున్నారు. సిఎం కప్ పోటీల్లో మండల స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. తొలుత ఫుట్‌బాల్‌ను పురుషులకు మాత్రమే షెడ్యూల్ చేయగా.. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం విజ్ఞప్తితో మహిళలకు సైతం ఫుట్‌బాల్‌ను షెడ్యూల్ చేశారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. సోమ, మంగళ, బుధ వారాల్లో మండల స్థాయిలో సిఎం కప్ పోటీలు జరుగుతాయి. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా స్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68